RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 05 సెప్టెంబర్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:85

## హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**గోకఫసల్వాడ్ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు, దౌల్తాబాద్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



ఎడ్యుకేషన్ హబ్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్, ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీలు, 430 బెడెడ్ హాస్పిటల్, ఇతర నిర్మాణాలు పరిశీలించిన సీఎం

ఎడ్యుకేషన్ హబ్ లో జరిగే అన్ని నిర్మాణాల విషయంలో సమన్వయంతో పనిచేయాలని సూచించిన సీఎం

నిర్మాణాల్లో నాణ్యత, ఇతర సాంకేతిక అంశాల విషయాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించిన సీఎం

వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించిన సీఎం



వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించిన సీఎం

## కొడంగల్ నియోజకవర్గంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలో ముఖ్యమంత్రి





కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని R&B పనుల పురోగతిని సమీక్షలో సీఎంకు వివరించిన అధికారులు

నియోజకవర్గ పరిధిలో రోడ్ కనెక్టివిటీ , భవన నిర్మాణాలు, బ్రిడ్జ్ లు, ఇతర నిర్మాణాల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించిన సీఎం

నియోజకవర్గంలో ప్రతీ తండాకు రోడ్డు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన సీఎం

తండాలకు రోడ్డు నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అక్కడికక్కడే సంబంధిత అధికారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించిన సీఎం

గ్రామాల్లో వాగుల వద్ద కల్వర్టులు, బ్రిడ్జ్ ల నిర్మాణానికి పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించిన సీఎం

చెక్ డ్యామ్ తరహాలో వాగుల వద్ద బ్రిడ్జిల నిర్మాణం ఉండేలా డిజైన్లు రూపొందించాలని సూచించిన ముఖ్యమంత్రి

కొడంగల్ నియోజకవర్గంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలో ముఖ్యమంత్రికి వివరించిన ఉన్నతాధికారులు

గత సమీక్ష సమావేశంలో సీఎం సూచనలను అనుగుణంగా పనుల్లో మక్తల్-నారాయణపేట్- కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి పంప్ హౌస్ పనులు ముందుకు తీసుకెళుతున్నామని తెలిపిన అధికారులు ఫేజ్-2 పనులకు వీలయినంత త్వరగా టెండర్లు పిలవాలని అధికారులకు సూచించిన సీఎం

ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచేందుకు ప్రతీ సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ కు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని ఆదేశించిన సీఎం

ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను పూర్తి చేయాలన్న సీఎం

ఫేజ్-1 పనులను డిసెంబర్ 2027 నాటికి, ఫేజ్-2 పనులను అక్టోబర్ 2028 నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించిన అధికారులు.

## హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరిక

**పార్టీలోనే కొనసాగితే సురేఖకు అవకాశాలు ఉంటాయని సూచన**

**సీఎం రేవంత్ రెడ్డి ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయరని స్పష్టీకరణ**

తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు.

"కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు.



ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీమతి గద్వాల్ విజయ లక్ష్మీ ని తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్ పర్సన్ గా నియమించిన శుభ సందర్భంగా గద్వాల్ విజయ లక్ష్మీ కి శాల్వతో సత్కరించి చెట్టు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కె. ఎస్. ఆనంద్ రావు కె. గోవింద్ రాజ్, బి. వీర రెడ్డి, ఎ. కోటి రెడ్డి, ఎన్. శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన సన్నబియ్యాన్ని విక్రయిస్తే రేషన్ కార్డులు రద్దు చేస్తామని హెచ్చరిక

**అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వని సర్పంచుల పదవులు ప్రమాదంలో పడతాయని స్పష్టీకరణ**

**పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ**

**కరువు సూచనల నేపథ్యంలో పామాయిల్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం**



ప్రభుత్వం సంక్షేమ పథకాల కింద అందిస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు అక్రమంగా అమ్ముకుంటే వారి రేషన్ కార్డులను రద్దు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా హెచ్చరించారు. పేదల ఆకలి తీర్చడానికి ఉద్దేశించిన బియ్యాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పూతాని తండాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి ప్రసంగించారు.

కొంతమంది లబ్ధిదారులు ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యాన్ని బయట అమ్ముకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. ఇది చాలా తప్పుడు పద్ధతని, పేదల కోసం ఉద్దేశించిన పథకాలను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని గుర్తించి, వారి రేషన్ కార్డులను రద్దు చేయడానికి కూడా వెనుకాడబోమని తేల్చి చెప్పారు.

ఇక, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి, ముఖ్యంగా గుడిసెల్లో నివసించే వారికి తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని మంత్రి అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఇళ్ల కేటాయింపులో పార్టీలకు అతీతంగా పేదరికాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సర్పంచులు తమ పదవులు కోల్పోవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు.

ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదై పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని, తీవ్ర కరువు పరిస్థితులు ఎదురుకావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తుమ్మల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే పామాయిల్ పంట సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. పామాయిల్ సాగు చేసేవారికి అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని భరోసా ఇచ్చారు.

రైతులకు భరోసా కల్పిస్తూ, రఘునాథపాలెం మండలానికి శుక్రవారం రాత్రికే సాగునీటిని విడుదల చేస్తున్నామని, రైతులు మరుసటి రోజు మోటార్లు ఆన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్నవారికి బోరుబావుల అనుమతులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న పోడు భూముల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనుల గురించి ప్రస్తావిస్తూ, మండలంలో రూ.75 కోట్లతో 200 డంపర్ రోడ్లతో పాటు పొలాలకు వెళ్లే దారులను నిర్మిస్తామని ప్రకటించారు. విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ఆయన, త్వరలోనే ఒక స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అటవీ శాఖ అధికారి అనుజ్ అగర్వాల్, భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు లేదు..**
**నాయకులంతా ఏకతాటిపై ఉన్నారు: వివేక్ వెంకటస్వామి**
వార్తా 4 లో

**సీఎం సభ స్థలాన్ని పరిశీలించిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం** వార్తా 8 లో

ప్రజాబలం

05 సెప్టెంబర్ 2026 శనివారం

## సుభాష్ చంద్ర కేసులో ఏం జరుగుతోంది

మీడియా దిగ్గజం, ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో కీలక పరిణామం చోటు చేసుకుంది.రూ.22006.57 కోట్ల క్లెయిమ్‌లకు గాను కేవలం రూ.6.5 కోట్ల చెల్లింపు ప్రణాళికకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఈ దివాలా ప్రణాళికకు డివిజన్ బెంచ్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో ఎన్ సీ ఎల్ టీ ప్రెసిడెంట్ జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్ నేతృత్వంలో 5 మంది సభ్యుల ప్రత్యేక రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు చేశారు. ఎన్‌సీఎల్‌టీ చరిత్రలోనే ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి ఐదుగురు సభ్యుల ప్రత్యేక బెంచ్ సెప్టెంబర్ 1, 2026న ఈ కేసులో నోటీసులు జారీ చేసింది. అశోక్ కుమార్ భరద్వాజ్, రీనా సిన్హాలతో కూడిన రెండవ నంబర్ ఎన్‌సీఎల్‌టీ డివిజన్ బెంచ్ ఈ దివాలా ప్రణాళికపై ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. మూడో సభ్యుడైన నిలేశ్ శర్మ ఇచ్చిన స్వతంత్ర ఉత్తర్వు సైతం డివిజన్ బెంచ్‌లోని ఇద్దరితో విభేదించడంతో మేజారిటీ తీర్పు లేనందున ఎటువంటి తుది ఉత్తర్వులు ఇవ్వలేమని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. మెజారిటీ అభిప్రాయం రాకపోవడంతో కేసును ఎన్ సీ ఎల్ టీ ప్రెసిడెంట్‌కు పంపారు.కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 419 (5) ప్రకారం చరిత్రలోనే మొదటిసారిగా 5 మంది సభ్యుల ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో జస్టిస్ అనుపిందర్ సింగ్ గ్రేవాల్, జ్యుడీషిల్ సభ్యులు బచు వెంకట్ బలరామ్ దాస్, మహేంద్ర ఖండేల్వాల్, టెక్నికల్ మెంబర్స్ అతుల్ చతుర్వేది, రవీంద్ర చతుర్వేదిలు ఉన్నారు. సుభాష్ చంద్ర వ్యక్తిగత హామీలపై రూ.22,006.57 కోట్ల రుణాలకు సంబంధించి రుణ దాతల క్లెయిమ్‌లపై ఆయన దివాలా పరిష్కార ప్రణాళికకు వెళ్లారు. ఈ క్రమంలో కేవలం రూ.6.5 కోట్లు చెల్లించేందుకు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపినట్లు వార్తలు వచ్చాయి. రూ.22 వేల కోట్లకు పైగా అప్పును రూ.6.5 కోట్లతో సెటిల్ చేసేందుకు 80.81 శాతం ఓటింగ్ ఉన్న రుణదాతలు ఆమోదం తెలిపారు. అయితే ఇది దాదాపు 99.97 శాతం రుణాల రద్దుకు దారితీస్తోంది.ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి 19.19 శాతం ఓటింగ్ కలిగిన సంస్థలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో ఇన్సాల్వెన్సీ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. సుభాష్ చంద్ర, అతని గ్రూప్ చాలా ఏళ్లుగా ఆర్థిక సంక్షోభంతో ఇబ్బంది పడుతోంది. వారి రుణ భారం క్రమంగా పెరుగుతూ వస్తోంది. కంపెనీలు తమ రుణాలను తిరిగి చెల్లించలేకపోయినప్పుడు విషయం కోర్టుకు చేరింది. నివేదికల ప్రకారం, ఎస్సెల్ గ్రూప్‌కు సుమారు ?22,006 కోట్ల భారీ అప్పు ఉంది. దీన్ని పరిష్కరించడానికి, సుభాష్ చంద్ర కేవలం ?6.5 కోట్ల తిరిగి చెల్లింపు ప్లాన్ ఇచ్చారు. దీనిని ట్రైబ్యునల్ ఆమోదించింది. అంటే రుణాలు ఇచ్చిన బ్యాంకులు తమ రుణాలపై భారీగా నష్టపోవాల్సి ఉంటుంది. ఈ కీలక నిర్ణయం ఆమోదానికి దారితీసిన న్యాయ ప్రక్రియ కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. సెప్టెంబర్ 2025లో, ఎన్ సీ ఎల్ టీ కి చెందిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం మధ్య రెండు విభిన్న అభిప్రాయాలు వెలువడ్డాయి. తదనంతరం, ఫిబ్రవరి 2026లో, ఈ విషయాన్ని ట్రైబ్యునల్ మూడో న్యాయ సభ్యుడైన నిలేష్ శర్మకు నివేదించారు. ఆయన ఈ ప్రణాళికను ఆమోదిస్తూ తన నిర్ణయాత్మక తీర్పును వెలువరించారు. అంతకుముందు, నవంబర్ 2024లో, రుణదాతల కమిటీ 80.814 శాతం ఓట్లతో ఈ ప్రణాళికను ఆమోదించింది. దివాలా, బ్యాంక్రప్టసీ కోడ్ ప్రకారం, ఏ ప్రణాళిక ఆమోదానికైనా 75 శాతం మెజారిటీ అవసరం,ప్రజలు తరచుగా ఎన్‌సిఎల్‌టిని ఒక కంపెనీగా భావిస్తుంటారు. కానీ వాస్తవానికి ఇది ఒక ప్రత్యేకమైన పాక్షిక-న్యాయ సంస్థ. దీని పూర్తి పేరు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్. దీనిని కేంద్ర ప్రభుత్వం, కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 408 కింద, 2016 జూన్ 1న అధికారికంగా ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలోని జస్టిస్ వి. బాలకృష్ణ ఎరాడి కమిటీ సిఫార్సుల ఆధారంగా ఈ సంస్థను ఏర్పాటు చేశారు. సాధారణ కోర్టుల ద్వారా కాకుండా, ఒక ప్రత్యేక వేదిక ద్వారా భారత్‌లో వ్యాపార, కార్పొరేట్ వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయడమే దీని ప్రాథమిక ఉద్దేశ్యం.కార్పొరేట్ ప్రపంచానికి సంబంధించి ఎన్‌సిఎల్‌టి కి విస్తృత శ్రేణి అధికారాలు, బాధ్యతలు ఉన్నాయి. ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఏఃఅ, 2016) ప్రకారం, కంపెనీలను దివాలా తీసినట్లు ప్రకటించడం లేదా వాటి రుణాలను పరిష్కరించడం వంటి విషయాలను ఇది విచారిస్తుంది. అంతేకాకుండా, రెండు లేదా అంతకంటే ఎక్కువ కంపెనీల మధ్య విలీనాలు, ఒక కంపెనీని విభజించడం లేదా కార్పొరేట్ పునర్నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలను కూడా ఇది ఆమోదిస్తుంది. వాటాదారులు, కంపెనీ యాజమాన్యం మధ్య వివాదాలను, లేదా నష్టాల్లో ఉన్న కంపెనీ చట్టపరమైన లిక్విడేషన్‌ను కూడా ఎన్‌సిఎల్‌టి పర్యవేక్షిస్తుంది.క్లెయిమ్‌లోని ప్రతి ?100కి రికవరీ మొత్తం కేవలం మూడు పైసలు మాత్రమే. ఈ కేసు ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతోంది..దివాలాలను పరిష్కరించడానికి, రుణాలను వసూలు చేయడానికి ఒక ఆధునిక చట్రాన్ని సృష్టించేందుకు దివాలా, బ్యాంక్రప్టసీ కోడ్, 2016ను రూపొందించారు. ఈ చట్టం కంపెనీలకు, కార్పొరేట్ రుణగ్రహీతలకు పూర్తిగా వర్తిస్తుంది. అయితే, వ్యక్తులు, భాగస్వామ్య సంస్థల దివాలా, బ్యాంక్రప్టసీకి సంబంధించిన ఐబిసిలోని పార్ట్ 3, సాధారణ ప్రజల కోసం ఇంకా పూర్తిగా అమలు కాలేదు.ఒక ముఖ్యమైన మినహాయింపు ఉంది. ఐబిసి ??ప్రకారం, ఒక కంపెనీ లేదా భాగస్వామ్య సంస్థ తీసుకున్న కార్పొరేట్ రుణానికి ఒక వ్యక్తి వ్యక్తిగత హామీ ఇచ్చి, ఆ తర్వాత రుణగ్రహీత చెల్లింపులో విఫలమైతే, ఆ వ్యక్తి దివాలా ప్రక్రియను ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే పెద్ద కార్పొరేట్ రుణాలకు సంబంధించిన కేసులలో వ్యక్తిగత దివాలా ప్రక్రియలను ప్రారంభించవచ్చు. అప్పుల్లో ఉన్న వ్యక్తి కేవలం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి దివాలా ప్రకటించుకోలేరు. వారు సాధారణంగా సంబంధిత న్యాయస్థానానికి వెళ్లి, అధికారిక న్యాయ ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. అప్పులు తీసుకున్న వ్యక్తి ఒక న్యాయవాది సహాయంతో దివాలా కోసం దరఖాస్తు చేసుకోవాలి. అప్పులు ఇచ్చిన సంస్థలు, చెల్లించాల్సిన అప్పులు, ఆస్తులు, ఆదాయంతో సహా తమ ఆర్థిక పరిస్థితికి సంబంధించిన సమాచారాన్ని అందించాలి. ఆ వ్యక్తి తాము నిజంగా తమ ఆర్థిక బాధ్యతలను నెరవేర్చలేకపోతున్నామని, తమ అప్పులు చెల్లించే సామర్థ్యానికి మించి ఉన్నాయని నిరూపించుకోవాలి. ఆ తర్వాత న్యాయస్థానం కేసును విచారిస్తుంది, సంబంధిత పార్టీల వాదనలు వింటుంది. అవసరమైన విచారణలు జరుపుతుంది.దివాలా ప్రకటించడం అంటే కేవలం అప్పుల నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదు. ఇది ఒక వ్యక్తి ఆస్తులు, ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్ అవకాశాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఇందులో అత్యంత ముఖ్యమైన పరిణామం వ్యక్తిగత ఆస్తుల అమ్మకం. అప్పటి పరిస్థితులు, వర్తించే చట్టాలను బట్టి, ఇల్లు, కారు లేదా ఆభరణాలు వంటి ఆస్తులను దివాలా ప్రక్రియలో చేర్చి, రుణదాతలకు చెల్లించడానికి ఉపయోగించవచ్చు. కొన్ని ముఖ్యమైన వస్తువులను కాపాడుకోగలిగినప్పటికీ, దివాలా అంటే ఒక వ్యక్తి తన ఆస్తులన్నింటినీ ఉంచుకొని, అప్పులన్నీ తీరిపోతాయని కాదు. ఒక వ్యక్తి ఆర్థిక ప్రతిష్ట కూడా తీవ్రంగా దెబ్బ తింటుంది. ఫలితంగా భవిష్యత్తులో రుణాలు పొందే సామర్థ్యంపై తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. దీనివల్ల సాంప్రదాయ బ్యాంకింగ్ క్రెడిట్ సేవలను పొందడం కష్టమవుతుంది.

# లాడ్ బజార్‌లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**భక్తిశ్రద్ధలతో మార్మోగిన శ్రీకృష్ణ మందిరం..**

**ప్రత్యేక పూజలు, జన్మదిన వేడుకలకు భారీగా తరలివచ్చిన భక్తులు**



హైదరాబాద్, సెప్టెంబర్ 4 శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని లాడ్ బజార్‌లోని శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారగా, శ్రీకృష్ణ నామస్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఈ వేడుకలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి స్వామివారి జన్మదిన వేడుకల్లో పాల్గొని, శ్రీకృష్ణుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్. ధన్‌రాజ్ కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు వారికి ఘన స్వాగతం పలికారు.

ధర్మం, నీతి, మానవతకు శ్రీకృష్ణుడి బోధనలు శ్రీకృష్ణుడి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ధర్మాన్ని కాపాడేందుకు అవసరమైనప్పుడు పోరాడాలనే సందేశాన్ని భగవద్గీత ద్వారా ప్రపంచానికి అందించారని నాయకులు పేర్కొన్నారు. కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు.

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, భజనలు, తీర్థప్రసాద కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులు, మహిళలు, యువత ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపించాయి.

భక్తి, రాజకీయ సందేశం కలిసిన వేడుకశ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. శ్రీకృష్ణుడి బోధనలను ఆచరణలో పెట్టడం ద్వారానే సమాజంలో ధర్మం, న్యాయం, మానవతా విలువలు మరింత బలపడతాయని అన్నారు.వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొనగా, శ్రీకృష్ణుడి నామస్మరణతో లాడ్ బజార్ మార్మోగింది. పండుగను విజయవంతం చేయడంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానికులు సమన్వయంతో వ్యవహరించారు.

# తన పేరుతో సర్క్యులేట్ అవుతున్న పోస్టులను ఖండించిన కొండా సురేఖ

**క్రమశిక్షణ చర్యల కింద కేబినెట్ నుంచి సురేఖకు ఉద్వాసన**

**కుమార్తె వ్యాఖ్యలపై ఇచ్చిన షోకాజ్ నోటీసుతో మొదలైన వివాదం**

**అధిష్ఠానాన్ని బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని రేవంత్ రెడ్డిపై ఆరోపణ**

**కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని స్పష్టం చేసిన మాజీ మంత్రి**



తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు.

మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు.

గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు.

ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది.

కాగా, కేబినెట్ నుంచి తనను తొలగించడాన్ని కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని సీఎం రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి తనను తొలగించారని ఆమె ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఈ కుట్ర వెనుక ఉన్నారని విమర్శించారు. అయితే, తాను, తన భర్త కొండా మురళి కాంగ్రెస్ పార్టీని వీడబోమని ఆమె స్పష్టం చేశారు. బీజేపీలో చేరడం లేదా కొత్త పార్టీ పెట్టడం వంటి ప్రచారాన్ని తోసిపుచ్చుతూ "నేను ఎక్కడికీ వెళ్లడం లేదు" అని స్పష్టం చేశారు.

## కొండా సురేఖకు అధికారిక భద్రత ఉపసంహరించుకున్న రేవంత్ ప్రభుత్వం

**మంత్రివర్గం నుంచి కొండా సురేఖ తొలగింపు**

**మంత్రి హోదాలో కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం వెనక్కి**

**ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ గన్‌మెన్లను రీకాల్ చేసిన ప్రభుత్వం**

**మంత్రి పదవి నుంచి తొలగించిన మరుసటిరోజే చర్యలు**

**ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ**



తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక భద్రతను పూర్తిగా ఉపసంహరించుకుంది. మంత్రివర్గం నుంచి ఆమెను తొలగించిన మరుసటి రోజే ఈ చర్యలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంత్రి హోదాలో ఆమెకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో పాటు, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ పరిధిలోని ప్రత్యేక గన్‌మన్లను ప్రభుత్వం తక్షణమే వెనక్కి పిలిపించింది.

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం వెలువడిన కొన్ని గంటల్లోనే ఆమె భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను రద్దు చేస్తూ అధికారులు చర్యలు చేపట్టారు. దీనితో ఆమె అధికారిక కాన్వాయ్, ఎస్కార్ట్ భద్రత పూర్తిగా నిలిచిపోయాయి.

ప్రోటోకాల్ నిబంధనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఒక వ్యక్తి మంత్రి పదవిలో లేనప్పుడు, వారికి కేటాయించిన ప్రత్యేక భద్రతను ఉపసంహరించడం సాధారణ ప్రక్రియ అని అధికారులు పేర్కొంటున్నారు. అయితే, మంత్రి పదవి నుంచి తొలగించిన వెంటనే ఇంత వేగంగా భద్రతను వెనక్కి తీసుకోవడంపై రాజకీయ విశ్లేషకులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది కొండా కుటుంబానికి ప్రభుత్వం పంపిన ఒక బలమైన సంకేతంగా కొందరు భావిస్తున్నారు.ఈ వరుస పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖ తన భవిష్యత్ రాజకీయ ప్రస్థానాన్ని ఎలా మలచుకుంటారనే అంశం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆమె తదుపరి అడుగులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# ధర్మానికి దిక్సూచి శ్రీకృష్ణ పరమాత్ముడు

## ఉట్లు కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్,చిత్తారు సింహాద్రి యాదవ్



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం సెప్టెంబర్4:**శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా దేశమంతటా పల్లెల్లో, గ్రామాలలో, నగరాలలో పట్టణాలలో జరుపుకునే వేడుకలు లో భాగంగా బాలకృష్ణుడు గా ఉన్నప్పుడు గోపికలు ఉట్టిపై దాచిన వెన్నను దొంగిలించడానికి చేసిన ప్రయత్నాలను కులాల వర్గాలకతీతంగా ముఖ్యంగా యాదవులుఈ రోజు ఉట్లు కొట్టే కార్యక్రమం పండుగ వాతావరణం గా, ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరం 17వ డివిజన్ టీచర్స్ కాలనీ,ప్రకాష్ నగర్, చింతకాని మండలం కొదుమూరు, వైరా మండల అష్ణ గుర్తి గ్రామాల్లో జరిగిన కృష్ణాష్టమి ఉత్సవాలలో డిసిసిబి డైరెక్టర్, అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్, నాగనబోయిన రాజారాం లు పాల్గొని యాదవ యువకులను ప్రోత్సహిస్తూ, ఉట్టి తాడును గుంజడం, పోయడం లాంటి సంబరాలు జరిపారు. అనంతరం మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ

మూగజీవాలను కంటికి రెప్పలా కాపాడుతూ, గోవులను సంరక్షిస్తూ అమాయకంగా జీవించే యాదవుల వంశంలో సాక్షాత్తు శ్రీమహావిష్ణువు దశావతారం లో భాగంగా గోవులను ఇష్టపడే గోవిందునిగా, దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించే శ్రీకృష్ణ పరమాత్మునిగా పరిపూర్ణమైన భగవంతుడిగా అవతరించిన మన యాదవ కులం ఎంతో పవిత్రమైనదని పురాణాలు చరిత్రలు చెబుతున్నాయి. ఇప్పటివరకు తిరుపతి వెంకటేశ్వర స్వామి నికూడా ప్రతిరోజు మొట్టమొదటి దర్శనం మన యాదవులకు మాత్రమే ఉండడం మన అదృష్టంగా భావిస్తున్నాను.

మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుడు బోధించిన గీతోపదేశం యుగాలు మారినా తరాలు మారినా ప్రపంచవ్యాప్తంగా ధర్మానికి దిక్సూచిగా నిలబడిందని, అలాంటి మహాగ్రంధమును ప్రతి ఒక్కరి ఇంటిలో ఉంచుకోవాలని, ఈ కార్యక్రమం జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో కాటమరాజు ప్రతాపరుద్రుడు, శ్రీకృష్ణదేవరాయలు లాంటి యాదవులంతా రాజ్యాలను పాలించారని, వారి కాలంలో ప్రజలు సుఖశాంతులతో జీవించారని చరిత్రలు చెబుతున్నాయి. అందుకే మన యాదవులంతా ఐక్యంగా ఉంటే గతంలో కోల్పోయిన వైభవాన్ని ఉత్తర భారత దేశంలో లాగా మనం కూడా ఇక్కడ సాధించ వచ్చని పిలుపునిచ్చారు., ఈ ఉత్సవ కార్యక్రమంలో నాగన్న బోయిన నాగరాజు, కొమ్ము శ్రీశైలం, కొమ్మ మల్లయ్య, మట్టపల్లి వెంకన్న, కొమ్ము శ్రీను, అవిరేని శ్రీను, వీరబోయిన సైదులు, అఖిలభారత యాదవ మహాసభ నాయకులు, కార్యకర్తలు, వృద్ధులు బాలురు, భారీ ఎత్తున పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లికి ముక్కుపుడక బహూకరణ

## మహిళా మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పూజలు





**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి:**వేములవాడ పట్టణంలోని మహిళా మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బంగారు ముక్కుపుడకను భక్తిపూర్వకంగా బహుకరించి, ఒడిబియ్యం, చీర సమర్పించారు.గంగమ్మ తల్లి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మహిళలు ప్రార్థించారు. ముఖ్యంగా మూలవాగు ఎల్లప్పుడూ జలకళతో ప్రవహిస్తూ, రైతుల పొలాల్లో పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలకు పాడిపంటలు, సిరిసంపదలు సమకూరాలని అమ్మవారిని వేడుకున్నారు.అమ్మవారికి ముక్కుపుడక సమర్పించే కార్యక్రమాన్ని అత్యంత భక్తిభావంతో నిర్వహించడంతో అక్కడ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు భక్తి పాటలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొని గంగమ్మ తల్లి ఆశీస్సులు పొందారు.గంగమ్మ తల్లి దీవెనలతో వేములవాడ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలనీ మూలవాగు నిరంతరం ప్రవహించి రైతుల జీవితాల్లో ఆనందం నింపాలి" అని మహిళా మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులు ఆకాంక్షించారు.

## వైభవంగా శ్రీ మహాలక్ష్మి ఆలయంలో శ్రావణ నాలుగో శుక్రవారం పూజలు





**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి, సెప్టెంబర్ 4:** వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ శ్రీ మహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం సందర్భంగా విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. బ్రాహ్మీ ముహూర్తంలో అమ్మవారికి మహాభిషేకం, ప్రత్యేక హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.అనంతరం మహిళా భక్తులతో సామూహిక లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించగా, ఓ మహిళా భక్తురాలు 108 కమలాలతో అమ్మవారికి ప్రత్యేక అర్చన చేశారు. సాయంత్రం సూర్యాస్తమయ వేళ శాస్త్రోక్తంగా 'ఛాయానక్త పూజ' నిర్వహించారు.





## గవర్నర్‌ను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

**ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**హైదరాబాద్, సెప్టెంబర్ 4, 2026: రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను ఎంపీ డా. కె. లక్ష్మణ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే శ్రీ దానం నాగేందర్ శుక్రవారం లోక్‌భవన్‌లో కలిశారు.

# రెడీమిక్స్ కార్మికునికి రావలసిన వేతనం ఇప్పించిన.. రవి సింగ్




**కూకట్పల్లి (ప్రజాబలం ) సెప్టెంబర్ 04:** గచ్చిబౌలి ఇండస్ట్రీ ఏరియా లో రెడీమిక్స్ కంపెనీలో కార్మికుడు దిగంబర్ గత రెండు సంవత్సరాల నుంచి పనిచేయడం జరుగుతుంది. కార్మికునికి రెండు నెలల వేతనం ఇవ్వకుండా రెడీమిక్స్ కంపెనీ ఓనర్ ఇబ్బంది పెట్టడం జరిగింది. రెడీమిక్స్ ఆ కార్మికునికి గత రెండు నెలల వేతనం మొత్తం మూడు నెలల, వేత్తనం రావాల్సి ఉండగా డబ్బులు ఇవ్వకుండా,ఏదో రకంగా నిర్లక్ష్యం చేస్తూ కార్మికుడు దిగంబర్ నీ ఇబ్బంది పెడుతూ పంపించేవాడు,ఆ కార్మికునికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి డ్రైవర్ల ద్వారా తెలుసుకొని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అతని గురించి తెలుసుకొని రవి కార్యాలయం వద్దకు వెళ్లి కార్మికునికి జరిగిన అన్యాయం చెప్పుకున్నారు ఆ తర్వాత వెంటనే స్పందించిన,రవి హుటాహుటిన, రెడీమిక్స్ కంపెనీ వద్దకు వెళ్లి కార్మికునికి రావలసిన వేతనం గురించి పలుమార్లు చర్చించి, రెండు నెలల వేతనం ఇప్పించడం జరిగింది. కార్మికుడు దిగంబర్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి మా తరపున, మా కుటుంబ సభ్యుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయంలో అగ్నిమాపక మాక్ డ్రిల్



వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అగ్నిప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. భీమేశ్వర స్వామి వసతి గృహం వద్ద డీఈ రామ్‌కిషన్‌రావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బందికి అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు.

లడ్డూ తయారీ కేంద్రం, నిత్యాన్నదాన సత్రం, విద్యుత్ విభాగం, ఎస్‌పీఎఫ్, హోంగార్డులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. గ్యాస్ సిలిండర్, వంట నూనె తదితర వాటి వల్ల మంటలు చెలరేగినప్పుడు అగ్నిమాపక పరికరాలతో ఎలా అదుపు చేయాలో అధికారులు ప్రదర్శన ద్వారా వివరించారు. అగ్ని ప్రమాద సమయంలో భయపడకుండా భక్తులను సురక్షితంగా బయటకు తరలించడం, విద్యుత్, గ్యాస్ సరఫరాను నిలిపివేయడం, మంటలు అదుపులోకి రాకపోతే వెంటనే 101 లేదా 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## రామప్ప దేవాలయంను సందర్శించిన సినీ నటుడు మురలీధర్ గౌడ్...



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 04 వెంకటాపురం**వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను శుక్రవారం సినీ నటుడు మురలీధర్ గౌడ్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరిశ్ శర్మ, ఉమాశంకర్ లు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.ఆలయ చరిత్ర,శిల్పకళ ప్రాముఖ్యత గురించి టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ వారికి వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లడుతూ చాలా సంవత్సరాల నుండి రామప్ప దేవాలయానికి వద్దాం అనుకున్న నేటితో ఆ కల నెరవేరిందని ఇక్కడ శిల్పకళా చాలా బాగుందని అని కోనియాడారు. అనంతరం రామప్ప చెరువు సందర్శించి బోటింగ్ చేశారు. కాగ మురలీధర్ గౌడ్ బలగం రంగస్థలం డీజే టిల్లు పుష్ప 2 కొరియన్ కనకరాజు సంక్రాంతికి వస్తున్నాం భగవద్ కేసరి మ్యాడ్ వంటి తదితర సినిమాల్లో నటించారు. వారి వెంట ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్ టూరిస్ట్ పోలిసులు అరుణ్ కుమార్, భద్రు, శ్రీకాంత్ దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

# ఫలితాలను ఇస్తున్న అక్షర ఆంధ్ర

విజయవాడ, సెప్టెంబర్ 4, దేశంలోనే అత్యంత తక్కువ అక్షరాస్యత కలిగిన రాష్ట్రాల్లో ఒకటిగా విమర్శలు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్, గత రెండేళ్లలో సాధించిన ప్రగతి విద్యా రంగంలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. 2024 నాటికి కేవలం 72.6 శాతంగా ఉన్న అక్షరాస్యత, 2026 నాటికి ఏకంగా 82.1 శాతానికి చేరుకుంది. జాతీయ సగటు కంటే వెనుకబడిన స్థితి నుంచి కేవలం రెండేళ్ల వ్యవధిలోనే దాదాపు 10 శాతం మేర అక్షరాస్యత పెరగడం వెనుక విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ చేపట్టిన పక్కా ప్రణాళికలు, క్షేత్రస్థాయి పరిశీలన, రిజల్ట్-ఓరియంటెడ్ విధానాలే ప్రధాన కారణం.ఈ భారీ మార్పుకు అక్షర ఆంధ్ర కార్యక్రమం వెన్నెముకగా నిలిచింది. విద్యా శాఖను చేపట్టిన వెంటనే నారా లోకేష్, కేవలం పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతోనే సరిపెట్టకుండా ఫలితాలు ఆధారంగా పనిచేసే ప్రత్యేక కార్యాచరణను అమలు చేశారు. సుమారు 11 ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలలో నిర్వహించిన అక్షరాస్యతా విభాగాలు, ఫీల్డ్ ప్రోగ్రామ్‌ల ద్వారా గత ఏడాది కాలంలోనే దాదాపు 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడం లోకేష్ పరిపాలనా దక్షతకు అద్దం పడుతోంది.అంతేకాకుండా, పాఠశాల విద్యలో డ్రాపౌట్లను తగ్గించి హాజరు శాతాన్ని పెంచడంపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఒఇంఖ యాప్ ద్వారా బడికి దూరమైన 1.64 లక్షలకు పైగా పిల్లల డేటాను సేకరించి, వారిలో సుమారు 33 వేల మందిని తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, టీచర్ల హాజరును 98.97 శాతానికి తీసుకెళ్లడం విద్యావ్యవస్థలో వచ్చిన సమూల మార్పుకు ఉదాహరణ. ఉపాధ్యాయుల కొరత తీర్చే దిశగా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, తల్లికి వందనం, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా విద్యార్థుల్లో జవాబుదారీతనాన్ని లోకేష్ పెంచగలిగారు.ఇప్పుడు ప్రభుత్వం విధించుకున్న ప్రతిష్టాత్మక లక్ష్యం సెప్టెంబర్ 2027 నాటికి 100% సంపూర్ణ అక్షరాస్యత సాధించడం. దీనికోసం 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, సెప్టెంబర్ 2027 నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చడానికి ప్రజాప్రతినిధులను, స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తూ టైమ్-బౌండ్ టార్గెట్లను నిర్దేశించారు. ఇది కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతీ నియోజకవర్గంలో కార్యాచరణ వేగవంతం అయ్యేలా ఐఏఎస్ అధికారులతో క్రమం తప్పకుండా చేస్తున్న సమీక్షలే ఈ వృద్ధికి బలం చేకూరుస్తున్నాయి.గడిచిన రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో నమోదైన ఈ గణనీయమైన మార్పు నారా లోకేష్ రాజకీయ, పరిపాలనా సామర్థ్యానికి ఒక బలమైన రుజువుగా నిలుస్తోంది. ఒకప్పుడు జాతీయ స్థాయిలో అక్షరాస్యతలో ఆఖరి వరుసల్లో నిలిచిన ఏపీని, 2027 నాటికి దేశంలోనే మొదటి సంపూర్ణ అక్షరాస్యత సాధించిన రాష్ట్రాలలో ఒకటిగా నిలిపేందుకు లోకేష్ వేస్తున్న అడుగులు ఆయన విజనరీ లీడర్‌షిప్‌ను స్పష్టం చేస్తున్నాయి.

# లోకల్ బాడీ ఎన్నికలకు కసరత్తు షురూ

విజయవాడ, సెప్టెంబర్ 4, ఏపీలో కూటమి పార్టీలు స్థానిక ఎన్నికలు రెడీ అవుతున్నాయి. ఇప్పటికే జనసేన అధిష్ఠానం.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్యకర్తలతో వరుసగా భేటీ అవుతుంది. టీడీపీ కూడా ఎన్నికల కసరత్తును స్పీడప్ చేసింది. ఈ నెల 6, 7 తేదీల్లో టీడీపీ ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఏడు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ ఎమ్మెల్యేలు అందరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలని టీడీపీ కేంద్ర కార్యాలయం ఆదేశించింది. ఎన్నికల నిర్వహణ కసరత్తులో భాగంగా ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఇవాళ సాయంత్రం మంత్రులు, కీలక నేతలతో సీఎం టింగ్ నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనులు, కూటమి పార్టీల సమన్వయంపై చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని, వాయిదా వేసే ప్రసక్తే లేదని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అమరావతిలో టీడీపీ మంత్రులతో ఆయన బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ పార్టీ నాయకులకు, ఎమ్మెల్యేలకు ఎన్నికల గురించి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ నాటికి పూర్తవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసి, అన్ని స్థానాల్లోనూ కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని మంత్రి లోకేష్ నేతలకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు దశలవారీగా జరుగుతాయని మంత్రి లోకేష్ తెలిపారు. మొదటిగా మున్సిపల్ ఎన్నికలు, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఆపై పంచాయతీ ఎన్నికలు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించుకుని, అన్ని స్థానాల్లోనూ ఎన్నికలు నిర్వహించేలా ప్రయత్నిస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన అర్హులందరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లను మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. ఎస్ఐఆర్ ఓటర్ల జాబితానే స్థానిక సంస్థల ఎన్నికలకు తుది జాబితాగా తీసుకోవాలని వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి ఫోర్సులో ఉన్న, చెల్లుబాటయ్యే ఓటర్ల జాబితానే ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయి తుది ఓటర్ల జాబితా వచ్చే వరకు ఎన్నికలను ఆపాల్సిన అవసరం లేదని ప్రభుత్వ వైఖరిగా ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే నాటికి అమల్లో ఉన్న ఓటర్ల జాబితాతోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై కోర్టు నుంచి అభ్యంతరాలు వచ్చినా.. వాటిని అధిగమించే మార్గాలపై ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. అవసరమైతే పార్టీ పరంగా కూడా బీసీలకు ఓసీ జనరల్ కేటగిరీలో సీట్లు కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలని టీడీపీ భావిస్తోంది.

# నాదెండ్ల మనోహర్ పై అసహనం

గుంటూరు, సెప్టెంబర్ 4, జనసేన పార్టీలో కీలక నేత నాదెండ్ల మనోహర్ పై ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. నాదెండ్ల తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు రాజకీయంగా తప్పుదోవ పట్టిస్తున్నారన్న భావన క్యాడర్ లో నెలకొంది. అంతా తానే అయి.. అధినేతను ఎవరినీ కలవనివ్వకుండా, వాస్తవ విషయాలను చెప్పనివ్వకుండా దాచి ఉంచుతున్నారని సోషల్ మీడియా వేదికగా ఆరోపిస్తున్నారు. నాదెండ్ల మనోహర్ పై ఇటువంటి ఆరోపణలు కొత్తేమీ కాదు. జనసేన పార్టీ పెట్టిన నాటి నుంచి పవన్ కళ్యాణ్ వెన్నంటే ఉన్న నాదెండ్లను పార్టీ నేతలు, కార్యకర్తలు వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. తమ వ్యతిరేకతను సోషల్ మీడియాలో వ్యక్త పరుస్తున్నారు. అంతే తప్పించి సభల్లోనూ, సమావేశాల్లోనూ పవన్ కళ్యాణ్ కు చెప్పేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. అయితే నాదెండ్ల కేవలం పవన్ చేసిన సూచనల మేరకే అమలు చేస్తున్నారని, ఇందులో ఆయన తప్పేముందని కూడా కొందరు నాదెండ్ల మనోహర్ ను సమర్థిస్తున్నారు.ప్రపంచ పటాలు పరిశీలించండి.పార్టీలో కీలకంగా మారడంతో... ఇక ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పవన్ కళ్యాణ్ అస్వస్థతకు గురి కావడం, చంద్రబాబుతో భేటీలోనూ, పార్టీ నేతల సమావేశంలోనూ నాదెండ్ల మనోహర్ కీలకం గా వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఆయనను నమ్మి కీలక పాత్రను అప్పగించారని చెబుతున్నారు. జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పై పార్టీ క్యాడర్ మరియు నేతల్లో కొంత అసంతృప్తి ఉందనే ప్రచారం సోషల్ మీడియా మరియు కొన్ని రాజకీయ వర్గాల్లో సాగుతుంది. .ప్రస్తుతం జనసేన పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతున్న తరుణంలో, నాయకత్వం మరియు క్యాడర్ మధ్య సమన్వయం కోసం ఆయన విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలిచే స్థానాల్లోనే పోటీ చేయాలని, బలం లేని చోట పోటీకి దిగవద్దని నాదెండ్ల మనోహర్ మనోహర్ వ్యాఖ్యానించడం దిగువ శ్రేణి నేతల్లో ఆగ్రహానికి కారణమయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు తో పాటు పొత్తుల విషయంలో నాదెండ్ల మనోహర్ పవన్ ను తప్పుదోవ పట్టించి తిరిగి తమకు అన్యాయం చేయడానికి సిద్ధమయ్యారని కొందరు నేరుగానే ఆరోపిస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో కూటమి పొత్తుల వల్ల కొందరు స్థానిక జనసేన నేతలకు పోటీ చేసే అవకాశం దక్కకపోవడంతో అంతర్గతంగా కొంత అసంతృప్తి వ్యక్తమైంది. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నేతల మధ్య ఉన్న విభేదాలు, నాదెండ్ల మనోహర్ వైఖరిపై విమర్శలుగా మారాయి. కూటమి ప్రభుత్వం మరియు జనసేన పార్టీలో చీలికలు తేవడానికి వైసీపీ వంటి ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని జనసేన వర్గాలు మండిపడుతున్నాయి.పార్టీలో ఎటువంటి అంతర్గత విభేదాలు లేవని, జనసేనలో కేవలం "పవన్ కళ్యాణ్ గ్రూప్" మాత్రమే ఉందని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు, వీరమహిళకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుర్తింపు, అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు.తాను ఎక్కడికి వెళ్లినా జనసైనికులు ఆత్మీయంగా పలకరిస్తున్నారని, పార్టీ శ్రేణులు అంతా ఐక్యంగా ఉన్నారని నాదెండ్ల మనోహర్ ఇటీవలే పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు లేదు..

## నాయకులంతా ఏకతాటిపై ఉన్నారు: వివేక్ వెంకటస్వామి

**కాంగ్రెస్ నేతలంతా రాష్ట్ర అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నారన్న వివేక్**

**వెయ్యి రోజుల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని వెల్లడి**

**22ఏ జీవోను పునఃపరిశీలిస్తున్నామన్న మంత్రి**



కాంగ్రెస్ పార్టీలో ఎక్కడా వర్గపోరు లేదని, నాయకులంతా ఏకతాటిపై నిలిచి పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలంగాణ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజాదరణ పొందిందని వెల్లడించారు.

రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 22ఏ నిరోధిత భూముల వివాదంపై మంత్రి స్పందిస్తూ... ఈ సమస్య ముమ్మాటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే ఉత్పన్నమైందని మండిపడ్డారు. ఆనాటి జీవోను పునఃపరిశీలించి, సవరణలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా నిరోధిత జాబితా చిక్కులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు.

కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ఆరోపించిన మంత్రి వివేక్, ఈ వైఫల్యంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ఉనికి కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, గత పదేళ్ల స్వార్థ పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదని ఆయన వ్యాఖ్యానించారు.

# ఢిల్లీని ముంచెత్తిన కుండపోత వర్షం.. జలదిగ్బంధంలో ఎయిర్‌పోర్ట్

**దేశ రాజధానిలో భారీ వర్షపాతం నమోదు**

**విమాన సేవలకు తీవ్ర అంతరాయం, 400కు పైగా ఫ్లైట్స్ ఆలస్యం**

**9 విమానాలను జైపూర్, లక్నో, అహ్మదాబాద్‌కు దారి మళ్లింపు**

**ప్రయాణికులకు హెచ్చరికలు జారీ చేసిన ఇండిగో, ఎయిర్ ఇండియా**

**ఢిల్లీకి రెడ్ అలర్ట్ ప్రకటించిన భారత వాతావరణ శాఖ (IMD)**



దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం భారీ వర్షం ముంచెత్తింది. ఈ కుండపోత వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం జలమయమైంది. దీంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వందలాది విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా, పలు విమానాలను ఇతర నగరాలకు దారి మళ్లించారు.

వివరాల్లోకి వెళితే, శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఢిల్లీలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలోని పలు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. ఈ ప్రభావంతో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల మధ్యలో దాదాపు తొమ్మిది విమానాలను దారి మళ్లించారు. వీటిలో నాలుగు విమానాలను జైపూర్‌కు, మరో నాలుగు లక్నోకు, ఒకటి అహ్మదాబాద్‌కు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లైట్‌రాడార్24 డేటా ప్రకారం, 400కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఈ విమానాశ్రయంలో రోజుకు 1,300కు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమాన సర్వీసులపై ప్రభావం పడిందని ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు వేర్వేరుగా ప్రకటించాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించాయి. రోడ్లపై నెమ్మదిగా ప్రయాణం సాగుతున్నందున, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించుకోవాలని ఇండిగో కోరింది.

ఎయిర్‌పోర్ట్‌లో కార్యకలాపాలపై ప్రభావం పడిందని, తాజా సమాచారం కోసం ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ యాజమాన్యం విజ్ఞప్తి (జీఎంఆర్) చేసింది. నీటిని తొలగించడానికి తమ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపింది. మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తీవ్ర వర్షపాతం నమోదవుతుందని హెచ్చరించింది. ఈ ఆకస్మిక పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఆరణికి రాజకీయ ఇబ్బందులు

తిరుపతి, సెప్టెంబర్ 4, కొందరు పార్టీలు మారి ఎమ్మెల్యేలు కావచ్చు. అంత మాత్రాన పట్టున్న నియోజకవర్గంలో కాలరెగరేస్తే రాజకీయ భవిష్యత్ ఇబ్బందుల్లో పడే అవకాశముంది. ప్రస్తుతం జనసేన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిస్థితి కూడా అలాగే ఉంది. తిరుపతి నియోజకవర్గంలోని జనసేన నేతలు, కార్యకర్తల నుంచి ఆయన వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ఇక కూటమిలోని మిత్ర పక్షాలు కూడా ఆయనకు మద్దతుగా నిలిచే అవకాశం కనిపించడం లేదు. ఆయన తిరుపతి ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడంతో పాటు, తమను కూడా దూరం పెట్టడంతో కూటమిలోని మిత్ర పక్షాల నుంచి ఆరణికి రాజకీయ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయనపై ఉన్న అసంతృప్తి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశముందన్న ఆందోళన జనసేన నేతల్లో ఉంది. స్థానిక క్యాడర్ నుంచి... తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ క్యాడర్, స్థానిక నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జనసేన క్యాడర్‌ను పట్టించుకోకపోవడంతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కార్యకర్తలను, సీనియర్లను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.వైసీపీ నేతలతో సంబంధాలు కూడా ఆరణి శ్రీనివాసులుకు ఇబ్బందిగా మారాయంటున్నారు. కూటమి కార్యకర్తలను పక్కన పెట్టి, కొందరు వైసీపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక మున్సిపల్ కార్పొరేషన్ వ్యవహారాలలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యే బంధువులు, కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడం వివాదాస్పదమైంది. ఇప్పటికే ఆరణి శ్రీనివాసులుపై సొంత పార్టీ నేతలే ఫిర్యాదు చేయడంతో సమన్వయంతో పనిచేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్వయంగా ఆయనకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఆరణి శ్రీనివాసులు వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చారు. 2019 లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. నాడు తిరుపతి ప్రాంతంలోని అనేక మంది వైసీపీ నేతలతో సంబంధాలున్నాయి.

# ప్రియురాలికి ఐఫోన్ గిఫ్ట్ ఇచ్చేందుకు యువకుడి గంజాయి స్మగ్లింగ్

## ప్రియురాలితో కలిసి గంజాయి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు

ఖమ్మం ఒడిశాలోని పసుపులంకలో రూ.16 వేలతో 12 కిలోల గంజాయి కొనుగోలు చేసి, రూ.6 లక్షలకు హైదరాబాద్లో విక్రయించేందుకు పెద్దపల్లికి చెందిన మిత్ర చైతన్య(21), హేమలత(20) అనే ప్రేమ జంట ద్విచక్ర వాహనంపై గంజాయిని తరలిస్తోంది. ఖమ్మం జిల్లా వైరా క్రాస్రోడ్డు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి, బైక్ ఆపకుండా పారిపోయే ప్రయత్నం చేసారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని నాలుగు సెల్ఫోన్లు, గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రియురాలి బర్త్డేకు ఐఫోన్ కొనివ్వాలని గంజాయి విక్రయిస్తున్నట్టు పోలీసుల విచారణలో మిత్ర చైతన్య వెల్లడించారు. వీరికి గంజాయి విక్రయించిన భగవాన్ హంతాల్ అనే వ్యక్తితో పాటు, హైదరాబాద్లో వీరి నుంచి గంజాయి కొనాల్సిన శశి, నాగుల అనే వ్యక్తులు పరారీలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.



# దుమ్మురేపుతున్న అవకాడో సేల్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 నరేంద్ర మోడీ.. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విపరీతంగా యాక్టివ్ గా ఉంటున్నారు. రకరకాల వీడియోలను ఆయన పోస్ట్ చేస్తున్నారు. యువతరానికి ఆయన దగ్గర కావడానికి మరింత ప్రయత్నాలు చేస్తున్నారు. తద్వారా జెన్ జెడ్ కోపాన్ని చల్లార్చుతున్నారు. ఆ వీడియోలో నరేంద్ర మోడీ రాజకీయాల గురించి మాట్లాడలేదు. ఇతర వ్యవహారాల గురించి చర్చించలేదు. జస్ట్ ఒక పండు గురించి చెప్పారు. అది కూడా అవకాడో పండు గురించి.. ఆ పండు తింటే ఆరోగ్యం బాగుంటుందని ఆయన చెప్పుకొచ్చారు.. వాస్తవానికి నరేంద్ర మోడీ చెప్పిన ఆ పండు మనదేశంలో కొన్ని ప్రాంతాలలో మాత్రమే పండుతుంది. ఇటీవల కాలంలో ఔత్సాహిక రైతులు ఆ పంటను సాగు చేస్తున్నారు. కాకపోతే దిగుబడి గొప్పగా రావడం లేదు.అవకాడో వెస్టర్న్ దేశాలలో విపరీతంగా పండుతూ ఉంటుంది. అమెరికా నుంచి మొదలు పెడితే రష్యా వరకు చాలా దేశాలు ఈ పండును ఇతర దేశాలకు ఎగుమతి చేస్తూ ఉంటాయి. అవకాడో పండు మార్కెట్ విలువ కోట్లలో ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం పాశ్చాత్య దేశాలకు సంబంధించిన వారు అవకాడో పండును బ్రేక్ఫాస్ట్.. డిన్నర్ లో ఎక్కువగా వాడుతూ ఉంటారు. పార్టీలు జరిగినప్పుడు ఈ పండుతో రకరకాల వంటకాలు చేసుకొని ఆస్వాదించుకుంటూ తింటారు.అవకాడో పండులు యాంటీ యాక్సిడెంట్లు.. లైకో పీన్.. బీటా కెరోటిన్ వంటివి విపరీతంగా ఉంటాయి. అవకాటిని బి అనే లిపిడ్ ఇందులో అధికంగా ఉంటుంది. ఇది ల్యూకేమియా కణాలను నాశనం చేస్తూ ఉంటుంది. గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది. ఈ పండు వాడటం వల్ల అల్జీమర్స్ వంటి రోగాలు రాకుండా ఉంటాయి.. అందువల్లే పాశ్చాత్య దేశాలకు సంబంధించిన వారు ఈ పండును విరివిగా తింటూ ఉంటారు. జన్ జెడ్ తరానికి అర్థమయ్యే విధంగా నరేంద్ర మోడీ ఆ వీడియోలో అవకాడో పండు గురించి చెప్పడం విశేషం. అయితే అవకాడో పంట ఉత్పత్తిని పెంచడానికి, సాగును ప్రోత్స హించడానికి కేంద్రం భారీగా కేటాయింపులు చేస్తుండటం విశేషం. మోడీ వీడియో ద్వారా ఈ పంట సాగు మనదేశంలో పెరిగే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటు న్నారు. ఈ పంట సాగు చేసే రైతులకు భారీగా లాభాలు వస్తాయని చెబుతున్నారు.

# పట్టాలపై నడిచే ఫైవ్ స్టార్ హోటల్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 మనదేశంలో అత్యంత చవకైన రవాణా వ్యవస్థగా రైల్వే శాఖకు పేరు ఉంది. ఆంగ్లేయుల కాలం నుంచి మనదేశంలో రైల్వే వ్యవస్థ ఏర్పాటు అయింది. అప్పటినుంచి దినదిన ప్రవర్ధమానంగా ఎదుగుతుంది. ప్రతి ఏడాది ప్రయాణికులు పెరుగుతూ ఉండడం.. ప్రయాణికులు ప్రీమియం సౌకర్యాలు కోరుకుంటున్న నేపథ్యంలో.. రైల్వే శాఖ వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. మొన్నటిదాకా వందే భారత్ రైళ్లలో స్లీపర్ కోచ్ లు అందుబాటులో ఉండేవి కాదు. ప్రయాణికుల నుంచి విజ్ఞప్తులు పెరిగిపోవడంతో రైల్వే శాఖ భారీగా వెచ్చించి.. సుదూర రాత్రి ప్రయాణాల కోసం వందే భారత్ స్లీపర్ కోచ్ లు అందుబాటులోకి తీసుకొచ్చింది. కొత్త వెర్షన్లో ప్రయాణికులకు అత్యద్భుతమైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేసాయి. ఒక రకంగా స్లీపర్ కోచ్ లను పట్టాల మీద నడిచే ఫైవ్ స్టార్ హోటల్ అని చెప్పవచ్చు.వందే భారత్ స్లీపర్ కోచ్ కు సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో బయటికి వచ్చింది. అందులో ఉన్న సౌకర్యాలు చూసి చాలామంది ఆశ్చర్యపోతున్నారు. ఇది ఒక లగ్జరీ హోటల్ లాగా ఉందని.. అద్భుతమైన సౌకర్యాలు ఇందులో ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు . ఆ వీడియోలో ఉన్న దృశ్యాలను చూస్తుంటే ప్రయాణికుల కోసం ప్రత్యేకమైన.. ప్రైవేట్ క్యాబిన్ ఉంది. అందులో లైటింగ్.. ప్రీమియం ఫినిషింగ్.. విశాలవంతమైన స్థలం అద్భుతంగా ఉన్నాయి.ప్రస్తుతం వందే భారత్ రైళ్లల్లో చైర్ కార్ ఏర్పాట్లు మాత్రమే ఉన్నాయి. కొత్తగా స్లీపర్ వెర్షన్ అందుబాటులోకి వచ్చింది. ప్రయాణికులకు ఈ కోచ్ అత్యంత సుఖవంతమైన నిద్ర వసతి అందిస్తుంది. అంతేకాదు ఫస్ట్ ఏసీ కోచ్ లలో విశాలవంతమైన స్థలాన్ని ఏర్పాటు చేశారు. క్యాబిన్ క్రమబద్ధంగా.. సౌకర్యవంతంగా ఉంది.

అదిరిపోయే స్థాయిలో సౌకర్యాలు

ఇందులో విలాసవంతమైన క్యాబిన్ సీట్లు ఉన్నాయి. రాత్రి ప్రయాణం కోసం విలాసవంతమైన నిద్రపోవడానికి ఏర్పాట్లు ఉన్నాయి.

దుర్వాసనతో కూడిన టాయిలెట్లు కాకుండా.. హోటల్ తరహాలోనే టాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఇవి బయో విధానంలో పనిచేస్తూ ఉంటాయి.

ప్రయాణికుల కోసం అత్యాధునికమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ప్రయాణానికి సంబంధించిన సమాచారాన్ని ప్రదర్శించడానికి అత్యంత ఆధునికమైన డిస్ప్లే స్క్రీన్ లను ఏర్పాటు చేశారు.

ఈ ఏడాది వందే భారత్ స్లీపర్ సర్వీస్ జనవరి నెలలో హౌరా నుంచి కామాఖ్య మధ్య మొదలైంది. ప్రస్తుతం ఇందులో 16 కోచ్ లు ఉన్నాయి. వాటిల్లో 11 ఏసి త్రీ టైర్.. 4 ఏసి టూ టైర్.. ఒకటి ఏసీ ఫస్ట్ క్లాస్ ఉన్నాయి. 823 మంది ప్రయాణించే సామర్థ్యం ఈ రైలు సొంతం. అయితే భవిష్యత్తు కాలంలో కోచ్ ల సంఖ్యను 24కు పెంచే అవకాశం ఉంది. ఈ రైలు గంటకు 160 నుంచి 108 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. దీనికి కవచ్ అనే పేరుతో యాంటీ కొలిజెంట్ టెక్నాలజీ వాడారు. ఇందులో ఆటోమేటిక్ డోర్లు.. బయో వ్యాక్యూమ్ టాయిలెట్లు.. సెన్సార్ ట్యాప్ లు.. రీడింగ్ లైట్లు.. మొబైల్ ఛార్జింగ్ పోర్ట్.. ఫస్ట్ ఏసీలో అయితే హాట్ వాటర్ షవర్ సౌకర్యం కూడా ఉంది.

# దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తురాలు మృతి



విజయవాడ ఇంద్రకీలాద్రి లో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తురాలు మృతి చెందింది. ఇంద్రకీలాద్రి మహా మండపం రెండో అంతస్తులో అస్వస్థతకు గురైయింది. భక్తురాలిని దేవస్థాన అంబులెన్స్లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలు పెనమలూరు మండలం తాడిగడపకు చెందిన కె. పద్మ(61. తన భర్త నాంచారయ్యతో కలిసి గురువారం అమ్మవారి దర్శనానికి వచ్చింది. అమ్మవారి దర్శనం అనంతరం అన్నప్రసాదం స్వీకరించేందుకు రెండో అంతస్తులో దింపాలని లిఫ్ట్ సిబ్బందిని భక్తురాలు కోరారు. రెండో ఫ్లోర్లో కాకుండా గ్రౌండ్ ఫ్లోర్లో దింపిన సిబ్బంది.. మెట్లపై రెండో అంతస్తుకు వెళ్లాలని ఆదేశించారు. మెట్లు ఎక్కే క్రమంలో తీవ్ర అస్వస్థతకు భక్తురాలు పద్మ గురయింది. వెంటనే పద్మను దేవస్థాన అంబులెన్స్లో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసారు. అయితే మార్గమధ్యలో పద్మ మృతి చెందింది.

# కొండా రాజకీయం... ఇప్పుడే మొదలు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం పెద్ద చర్చగా మారింది. మంత్రి పదవిలో ఉన్న సురేఖను సీఎం రేవంత్రెడ్డి కేబినెట్ నుంచి తప్పించారు. గవర్నర్ కూడా దీనికి ఆమోదం తెలిపారు. ఆ తర్వాత కొండా సురేఖ శాఖలు సీఎం దగ్గరకు చేరాయి. విమర్శలు, వివరణలు, రిపోర్టుల తర్జనభర్జన తర్వాత.. కొండా సురేఖ ఎపిసోడ్కు ఎండ్ కార్డ్ పడింది.. దీంతో ఒక్కసారిగా కొండా కుటుంబం రాజకీయ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. ఈ గొడవ ఒక్కరోజులో మొదలైంది కాదు. కొండా సురేఖ కూతురు సుష్మిత పటేల్ సీఎం రేవంత్రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడంతో అసలు గొడవ మొదలైంది. ముఖ్యంగా పరకాల సీటు విషయంలోనే కొండా కుటుంబానికి, రేవంత్రెడ్డి వర్గానికి మధ్య దూరం పెరిగిందనే చర్చ ఉందిపరకాల సీటు విషయంలో సుష్మితకు ఆసక్తి ఉందనే వార్తలు వచ్చాయి. కానీ అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్రెడ్డినే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని రేవంత్రెడ్డి చెప్పడంతో సమస్య మరింత పెరిగింది. సురేఖ మాత్రం కూతురు చేసిన మాటలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదని చెబుతున్నారు. కూతురు పెద్దదైందని, ఆమె మాటలకు తాను బాధ్యత వహించాల్సిన అవసరం లేదని ఆమె వాదిస్తున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలు మాత్రం పార్టీ విషయంలో క్రమశిక్షణ తప్పక పాటించాల్సిందే అన్న చందంగా వ్యవహరించారు.పరకాల పేరు ఈ గొడవలో పదేపదే వినిపించడం వెనుక రాజకీయ లెక్క ఉంది. కొండా కుటుంబానికి వరంగల్ ప్రాంతంలో చాలా ఏళ్లుగా రాజకీయ పరిచయాలు ఉన్నాయి. అదే సమయంలో రేవంత్రెడ్డి అక్కడ తనకు నమ్మకమైన నాయకులను ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్నారు. ఇద్దరి దారులు వేర్వేరుగా కనిపించడంతో దూరం పెరిగిందనే మాట వినిపిస్తోంది. సురేఖ కూడా తనను ప్రభుత్వం పక్కన పెడుతోందని గతంలో కొన్ని సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తం చేశారనే వార్తలు వచ్చాయి. అందుకే కూతురు చేసిన వ్యాఖ్యలు ఒక్కటే కారణం కాదని, ముందే కొంత దూరం పెరిగి ఉండొచ్చని రాజకీయంగా చర్చ జరుగుతోంది. అయితే ఇది రాజకీయ అంచనా మాత్రమే.కొండా సురేఖ కూడా మౌనంగా ఉండలేదు. తనను కావాలనే పక్కన పెట్టారని, తనపై కుట్ర జరిగిందని ఆమె ఆరోపించారు. సీఎం రేవంత్రెడ్డి సోదరులు, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి తదితరులపై కూడా ఆమె ఆరోపణలు చేశారు. అయితే ఇవన్నీ సురేఖ చేసిన ఆరోపణలే. వాటిని నిజమని నిర్ధారించే ఆధారాలు బయటకు రాలేదు. కాంగ్రెస్ మాత్రం పార్టీ నిర్ణయానికి కట్టుబడి ముందుకు వెళ్లింది. దీంతో మంత్రి పదవి పోయింది.ఇక్కడే అసలు రాజకీయం కనిపిస్తోంది. ఇది కేవలం ఒక మంత్రి పదవి పోయిన వ్యవహారం మాత్రమే కాదు. పార్టీలో ఎవరికి ఎంత బలం ఉంది, ఎవరితో ఎవరు కలిసి నడుస్తున్నారు, వచ్చే ఎన్నికల నాటికి ఎవరి మాట ఎంత వరకు చెల్లుతుంది అన్న లెక్కలు కూడా ఇందులో ఉన్నాయి.ఈ వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన ఆరోపణలు కూడా కలకలం రేపాయి. డబ్బుల పంపకానికి సంబంధించిన గొడవ వల్లే సురేఖను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆయన ఆరోపించారు. అవినీతి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని కూడా ఆయన అన్నారు. అయితే రాజాసింగ్ చెప్పింది ఆరోపణ మాత్రమే. దానికి ఇప్పటివరకు బలమైన ఆధారం బయటకు రాలేదు. సురేఖ కూడా తనపై అలాంటి ఆరోపణలు లేవని చెబుతున్నారు. కాబట్టి ఈ మాటలను రాజకీయ ఆరోపణలుగానే చూడాలి.సురేఖను తప్పించిన తర్వాత ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన పదవుల్లో బీసీ మహిళలకు చోటు కల్పించింది. గద్వాల్ విజయలక్ష్మి, నేరెళ్ల శారద, జీ. సుధారాణిలకు కీలక బాధ్యతలు ఇచ్చారు. ఈ మార్పులను కొందరు రాజకీయంగా చూస్తున్నారు. బీసీ వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఏర్పడే ప్రభావాన్ని సర్దుబాటు చేసే ప్రయత్నంగా కొందరు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇదే కారణంతో ఈ నియామకాలు చేసిందని అధికారికంగా చెప్పలేదు.తెలంగాణలో మంత్రి పదవిలో ఉండగానే బయటకు వెళ్లాల్సి వచ్చిన సందర్భాలు గతంలోను ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో 2015లో తాటికొండ రాజయ్యను మంత్రి పదవి నుంచి తప్పించారు. ఆ తర్వాత 2021లో ఈటల రాజేందర్ను కూడా కేబినెట్ నుంచి తొలగించారు. ఈటలపై భూముల విషయంలో ఆరోపణలు రావడంతో ఆయన శాఖను తీసుకుని, ఆ తర్వాత కేబినెట్ నుంచి బయటకు పంపారు. ఈ ఆరోపణలను ఈటల ఖండించారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని కూడా ఆయన అప్పట్లో చెప్పారు. ఇప్పుడు కొండా సురేఖ వ్యవహారం కూడా అదే వరుసలో మరో రాజకీయ ఘటనగా మారింది. అయితే మూడు ఘటనలకు మూడు వేర్వేరు కారణాలు ఉన్నాయి. అందుకే వాటిని ఒకే గాటన కట్టడం సరికాదు.మంత్రి పదవి పోయిందంటే కొండా కుటుంబం రాజకీయంగా అయిపోయిందని చెప్పలేం. వరంగల్ ప్రాంతంలో కొండా కుటుంబానికి ఇంకా పరిచయాలు, అనుచరులు ఉన్నారు. సురేఖకు కూడా తనకంటూ రాజకీయ బలం ఉంది. అందుకే ఇప్పుడు అందరి చూపు కొండా కుటుంబం తర్వాత ఏం చేస్తుందనే దానిపైనే ఉంది. కాంగ్రెస్లోనే ఉండి ముందుకు వెళ్తారా, కొంతకాలం మౌనంగా ఉంటారా, లేక మరో దారి చూసుకుంటారా అన్నది కాలమే చెప్పాలి.మొత్తానికి కూతురు చేసిన వ్యాఖ్యలతో మొదలైన గొడవ, పరకాల సీటు దగ్గర పెరిగిన దూరం, పార్టీలో పెరిగిన గ్యాప్, చివరకు మంత్రి పదవి పోయే వరకు వెళ్లింది. కానీ ఇంతటితో కొండా సురేఖ రాజకీయ కథ ముగియలేదు. కుర్చీ పోయింది. ఇక కొండా కుటుంబం వేసే తర్వాతి అడుగే తెలంగాణ రాజకీయాల్లో అసలు ఆసక్తికరమైన అంశంగా మారనుంది.

# లైన్ దాటితే వేటు క్లారిటీ ఇచ్చిన రేవంత్

హైదరాబాద్ సెప్టెంబర్ 4, తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పట్టును నిలుపు కున్నారు. హైకమాండ్ వద్ద తన పట్టు ఏంటో పార్టీ నేతలకు చాటి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ లో కట్టు తప్పితే క్రమశిక్షణ చర్యలు తప్పవన్న హెచ్చరికలను నేతలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న తరుణంలో, ఆయన నాయకత్వానికి అటు సొంత పార్టీ అంతర్గత విభేదాల నుండి, ఇటు ప్రతిపక్షాల నుండి గట్టి సవాళ్లు ఎదురవుతున్నాయి.ఇటువంటి పరిస్థితుల్లో కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై వేటు వేసి ఇకపై ఎవరు పార్టీ లైన్ కు వ్యతిరేకంగా మాట్లాడినా, వ్యవహరించినా ఊరుకునేది లేదన్న హెచ్చరికలు జారీ చేశారు. కాంగ్రెస్ లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. నాయకత్వాన్ని విమర్శించకుండా ఈ చర్యలు సత్ఫలితాలనిస్తాయని భావిస్తున్నారు.. మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ తో స్పష్టమైన సంకేతాలను పంపారు. రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, కాంగ్రెస్ హైకమాండ్ అనుమతితో మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి రేవంత్ రెడ్డి తక్షణమే తొలగించారు. తనను తొలగించకపోతే తానే తప్పుకుంటానని రేవంత్ రెడ్డి హైకమాండ్ను కోరినట్లు సురేఖ ఆరోపించారు. కానీ అది జరిగిందో లేదో తెలియదు కాని, రేవంత్ రెడ్డి హైకమాండ్ వద్ద తనదే పై చేయి అని నిరూపించుకున్నారు. ఈ నిర్ణయం ద్వారా పార్టీలో క్రమశిక్షణ విషయంలో తను ఎంత కఠినంగా ఉంటారో చూపిస్తూ తన పట్టును నిరూపించుకున్నారు. ఇక పై ఎవరు పార్టీ కి వ్యతిరేకంగా మాట్లాడినా ఇదే రకమైన చర్యలుంటాయని హెచ్చరికలు పంపగలిగారు. అందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సఫలీకృతులయ్యారు. ఇప్పటి వరకూ ఢిల్లీ హైకమాండ్ వద్ద పట్టులేదన్న ప్రతిపక్షాల నోళ్లను కూడా ఈ చర్యలతో రేవంత్ రెడ్డి మూయించగలిగారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసి తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ఆయన ఆమోదం పొందినట్లు కూడా తెలుస్తోంది. త్వరలోనే నలుగురు కొత్త ముఖాలను కేబినెట్లోకి తీసుకోబోతున్నారు. ఇది అసంతృప్త నేతలను సర్దుబాటు చేయడానికి మరియు తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి రేవంత్కు సహాయ పడనుంది.

పాలన, పెట్టుబడులపై దృష్టి పెట్టడానికి మరింత దోహదపడుతుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై, హామీల అమలుపై పోరాటాలు తీవ్రం చేశాయి. రాబోయే ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నందున, ప్రజా వ్యతిరేకతను అధిగమించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం రేవంత్ రెడ్డి ముందున్న అతిపెద్ద సవాలుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మొత్తం గా చూస్తే, రేవంత్ రెడ్డి ప్రస్తుత సంక్షోభాలను ధీటుగా ఎదుర్కొంటూ, అధిష్ఠానం మద్దతుతో పార్టీపై, ప్రభుత్వంపై పట్టు నిలుపుకునే వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు.

# అమరా ప్రసాద్ దిష్టిబొమ్మ దగ్ధం

కూకట్ పల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్పై అమర్ ప్రసాద్ కల్పిత నాయకుడు అనే పేరుతో పుస్తకం రచించి, ఈ నెల 18న విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియాలో ప్రకటించారు. దీనిని నిరసిస్తూ కూకట్పల్లి వై జంక్షన్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత, బహుజన నాయకుల ఆధ్వర్యంలో అమర్ ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ను అవమానించేలా పుస్తకం రాసి విడుదల చేయడం సరికాదన్నారు. ఈ పుస్తకం వెనుక కొంతమంది శక్తులు ఉన్నాయనే అనుమానం తమకు ఉందని పేర్కొన్నారు.

# సవాళ్లలో వేడెక్కిన రాజకీయం

మెదక్, సెప్టెంబర్ 4, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యర్థి బీఆర్ఎస్‌పై విసిరిన కేసీఆర్ రాజీనామా డిమాండ్ తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడిని రాజేసింది. ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారనే విమర్శలతో కేసీఆర్‌ను ఆత్మరక్షణలోకి నెట్టేందుకు కాంగ్రెస్ ఈ పావు కదిపినప్పటికీ, ఇది పొరపాటున నిజమైతే ఉత్పన్నమయ్యే పరిణామాలు అధికార పక్షానికి సవాలుగా మారే అవకాశముంది. కేసీఆర్ నిజంగానే గజ్వేల్ నియోజకవర్గానికి రాజీనామా చేసి ఉపఎన్నికను ఆహ్వానిస్తే, అది కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలనపై ఒక ప్రత్యక్ష రెఫరెండం గా మారే ప్రమాదం ఉంది.తెలంగాణ రాజకీయ చరిత్రను తిరగేస్తే కేసీఆర్‌కు ఉపఎన్నికల వ్యూహం కొత్తేమీ కాదు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో కేసీఆర్ రాజీనామాలను ఒక రాజకీయ ఆయుధంగా మలచుకుని, సెంటిమెంట్‌ను రగిలించి విజయం సాధించేవారు. ప్రతీ ఉపఎన్నికను తన ఆధిపత్య నిరూపణకు వేదికగా వాడుకున్న అనుభవం ఆయనది. నేడు కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉత్పన్నమవుతున్న ఉచిత హామీల అమలు ఆలస్యం, రైతు భరోసా, మౌలిక వసతుల సమస్యల ప్రతికూలతలను ఆసరాగా చేసుకుని కేసీఆర్ గనుక సవాల్‌ను స్వీకరిస్తే, పరిస్థితి కాంగ్రెస్‌కు కత్తిమీద సాము లా మారడం ఖాయం.ఒకవేళ గజ్వేల్ ఉపఎన్నిక అనివార్యమైతే, అది రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చివేస్తుంది. గత లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో పుంజుకుని ప్రధాన ప్రతిపక్ష స్థానం వైపు వేగంగా అడుగులు వేస్తున్న భారతీయ జనతా పార్టీ ఒక్కసారిగా రేసులో వెనుకబడిపోయే అవకాశం ఉంటుంది. సమరం నేరుగా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ గా రూపాంతరం చెందుతుంది. ఇది గులాబీ దళానికి పోగొట్టుకున్న క్యాడర్ ఉత్సాహాన్ని తిరిగి తెచ్చిపెట్టడమే కాకుండా, బిజెపి ప్రాబల్యాన్ని తాత్కాలికంగా పక్కకు నెట్టి మళ్లీ ప్రధాన పోరు తమదేనని నిరూపించుకోవడానికి ఒక సువర్ణావకాశం అవుతుంది.అయితే కాంగ్రెస్ పార్టీ ఈ సవాల్‌ను తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. అధికారంలో ఉన్నందున ప్రభుత్వ సర్వ శక్తులూ ఉపయోగిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం కేసీఆర్ ఈ సాహసం చేయరనే ధీమాతోనే ఈ విమర్శలు గుప్పించారు. ఒకవేళ ఉపఎన్నిక వస్తే, గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ భారీ వ్యూహరచన చేస్తుంది. అయితే, అధికారంలో ఉండి ఉపఎన్నికలో ఎదురుదెబ్బ తగిలితే ప్రభుత్వ ప్రతిష్ట దారుణంగా దెబ్బతింటుందనే ఆందోళన కూడా కాంగ్రెస్ పెద్దల్లో అంతర్లీనంగా ఉందనడంలో సందేహం లేదు.కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకుంటారా అనేది అతిపెద్ద ప్రశ్నార్థకం. ప్రస్తుత పరిస్థితుల్లో ఉపఎన్నికకు వెళ్లడం బీఆర్ఎస్‌కు క్లిష్టమైన సవాలే. గెలిస్తే ఒక్కసారిగా పార్టీ గ్రాఫ్ ఆకాశాన్ని తాకుతుంది. కానీ పొరపాటున అధికార కాంగ్రెస్ చేతిలో పరాజయం ఎదురైతే బీఆర్ఎస్ ఉనికికే అది ప్రమాదకరంగా మారుతుంది. గత సార్వత్రిక ఎన్నికల దెబ్బ నుంచి పార్టీ పూర్తిగా కోలుకోని నేపథ్యంలో, అంతటి పెద్ద సాహసానికి కేసీఆర్ రెడీ అవుతారా అన్నది సందేహమే. రేవంత్ రెడ్డి సవాల్‌తో తెలంగాణ రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. కేసీఆర్ రాజీనామా చేసి ఉపఎన్నిక బాట పడితే, అది కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీల భవిష్యత్తును, రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహాలను తేల్చే అగ్నిపరీక్షగా మారడం ఖాయం గులాబీ బాస్‌ను నైతికంగా ఆత్మరక్షణలోకి నెట్టి, కేడర్‌లో నైరాశ్యాన్ని మరింత పెంచాలనేది అధికార పక్షం వ్యూహంగా కనిపిస్తున్నప్పటికీ, రాజకీయ విశ్లేషకులు మాత్రం దీన్ని కాంగ్రెస్ వేస్తున్న అతి పెద్ద జూదంగానే భావిస్తున్నారు. కేసీఆర్ ఒకవేళ ఊహించని విధంగా ఈ సవాల్‌ను స్వీకరిస్తే, అది రేవంత్ రెడ్డి సర్కారుకు ముళ్లబాటగా మారే ప్రమాదముంది.సార్వత్రిక ఎన్నికల్లో విజయం, అధికార యంత్రాంగం చేతిలో ఉండటం రేవంత్ రెడ్డిలో దూకుడును, విపరీతమైన ఆత్మవిశ్వాసాన్ని పెంచాయనడంలో సందేహం లేదు. 'కేసీఆర్ ఎలాగూ రాజీనామా చేసే సాహసం చేయరు' అన్న గుడ్డి ధీమాతోనే కాంగ్రెస్ ఈ డిమాండ్‌ను తెరపైకి తెచ్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే రాజకీయాల్లో అతి విశ్వాసం ఎప్పుడూ ప్రమాదకరమే. ఒకవేళ కేసీఆర్ గజ్వేల్‌కు రాజీనామా చేసి ఉపఎన్నికను ఆహ్వానిస్తే, ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి నేటివరకు రేవంత్ పాలనపై అది నేరుగా ప్రజా రెఫరెండంగా మారుతుంది.ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, రైతు భరోసా నిధుల విడుదల, రైతు రుణమాఫీ ప్రక్రియలోని సాంకేతిక చిక్కులు, పింఛన్ల పెంపు వంటి అంశాలపై ప్రజల్లో అసహనం మొదలవుతోంది. పాలనాపరమైన ఈ ఒత్తిళ్లను బేరీజు వేసుకోకుండా కేసీఆర్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే లక్ష్యంగా రాజీనామా డిమాండ్ చేయడం రేవంత్ వ్యూహాత్మక తప్పిదమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ రాజీనామాలను ఒక రాజకీయ బ్రహ్మాస్త్రంగా మలచుకున్న నాయకుడు. 2004 నుంచి 2014 వరకు ఎంపీ, ఎమ్మెల్యే పదవులకు కేసీఆర్, ఆయన సహచరులు పదేపదే రాజీనామాలు చేసి, ఉద్యమ సెంటిమెంట్‌తో ఉపఎన్నికల్లో అఖండ విజయాలు సాధించిన రికార్డు ఉంది. ప్రజా వ్యతిరేకత కాస్త మొదలవుతున్న సమయంలో కేసీఆర్ గనుక బరిలోకి దిగితే, "తెలంగాణ తెచ్చిన నన్ను అధికార కాంగ్రెస్ అణగదొక్కాలని చూస్తోంది" అన్న సెంటిమెంట్‌ను రగిలించే అవకాశం ఉందిగజ్వేల్ కేసీఆర్‌కు కంచుకోట. హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఆ నియోజకవర్గంలో ఆయనకు గట్టి పట్టుంది. పైగా గత ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ మూడో స్థానంలో నిలిచింది. ఈ ఉపఎన్నిక అనివార్యమైతే, అది కాంగ్రెస్‌కు కత్తిమీద సాములా మారుతుంది. అధికార పక్షంగా సర్వశక్తులూ ఒడ్డి కేసీఆర్‌ను ఓడించేందుకు రేవంత్ సర్కారు ప్రయత్నించినా, ఫలితం ఏమాత్రం తేడా కొట్టినా ఆ ప్రభావం నేరుగా రేవంత్ రెడ్డి సీఎం కుర్చీపై, కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడపై పడుతుంది.లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో భారతీయ జనతా పార్టీ గణనీయంగా పుంజుకుని, తామే ప్రధాన ప్రతిపక్షమనే భావనను కలిగించే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ సైతం బీజేపీనే ప్రధాన శత్రువుగా చిత్రీకరిస్తూ బీఆర్ఎస్‌ను కాలగర్భంలో కలిపేసే వ్యూహాన్ని అమలు చేస్తోంది. కానీ గజ్వేల్ ఉపఎన్నిక జరిగితే, దృశ్యం ఒక్కసారిగా మారిపోతుంది. బీజేపీని పూర్తిగా పక్కకు నెట్టేసి, రాజకీయం అంతా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా మారుతుంది. ఉపఎన్నికలో కేసీఆర్ విజయం సాధిస్తే, అది నిస్తేజంలో ఉన్న గులాబీ కేడర్‌కు బూస్టర్ డోస్ ఇవ్వడమే కాకుండా, రాష్ట్రంలో తమ ప్రాబల్యాన్ని పునరుద్ధరించుకోవడానికి సువర్ణావకాశాన్ని ఇస్తుంది. అదే జరిగితే, రేవంత్ రెడ్డి స్వయంగా కోరి కష్టాలు కొని తెచ్చుకున్నట్లవుతుంది. అయితే, ఉపఎన్నికలో ఒకవేళ ఓడిపోతే బీఆర్ఎస్ ఉనికికే ముప్పు వస్తుందన్న భయం కేసీఆర్‌కు కూడా ఉంది. కానీ కేసీఆర్ రాజకీయ చదరంగంలో ఎలాంటి నిర్ణయమైనా ఆకస్మికంగా తీసుకుంటూ ఉంటారు. రేవంత్ రెడ్డి విసిరిన ఈ సవాల్ కేసీఆర్‌ను దెబ్బతీయడం కంటే, కాంగ్రెస్ పార్టీని ఒక క్లిష్టమైన రాజకీయ సుడిగుండంలోకి నెట్టే ప్రమాదమే ఎక్కువగా కనిపిస్తోంది. రేవంత్ విసిరిన ఈ పాచిక కేసీఆర్ స్వీకరిస్తే, తెలంగాణ రాజకీయం భీకర సమరానికి వేదిక కావడం ఖాయం.

## కల చెదిరింది...

వరంగల్, సెప్టెంబర్ 4, మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు ప్రారంభం కానున్నాయి. రాజీనామా చేసి ఉంటే పార్టీలో పరిస్థితులు మారాకా మంచి రోజులు వస్తాయని అనుకునేవారు. కానీ హైకమండ్ ను సైతం ధిక్కరించడంతో ఉద్వాసన తప్పలేదు. స్వయంగా ముఖ్యమంత్రి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం, పార్టీ క్రమశిక్షణను ఖాతరు చేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చింది. బర్తరఫ్ తర్వాత ఇక కాంగ్రెస్ గూటిలో ఆత్మాభిమానంతో కొనసాగడం కొండా కుటుంబానికి ఏమాత్రం సాధ్యం కాదనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.హైకమాండ్ వద్ద తమ వాదనను వినిపించేందుకు ఢిల్లీకి వెళ్లి ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. క్రమశిక్షణా ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించిన ఏఐసీసీ పెద్దలు సైతం వీరి విషయంలో ఎలాంటి ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించారు. సంక్షోభం తలెత్తిన ప్రారంభ దశలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొండా సురేఖ స్వయంగా రాఖీ కట్టి వివాదానికి తెరదించే అవకాశాన్ని అందిపుచ్చుకున్నప్పటికీ, ఆ తర్వాత కూడా ఆమె శైలిలో మార్పు రాలేదు. ఏ దశలోనూ పరిస్థితిని చక్కదిద్దుకునేందుకు, డ్యామేజ్ కంట్రోల్ చేసేందుకు కొండా దంపతులు ప్రయత్నించకపోగా.. రోజురోజుకూ ఘర్షణాత్మక వైఖరిని ప్రదర్శిస్తూ పార్టీ అధినాయకత్వంతోనే తెగతెంపులు చేసుకునే స్థాయికి వివాదాన్ని తెచ్చుకున్నారు.కొండా దంపతుల రాజకీయ గతాన్ని పరిశీలిస్తే ఎక్కడా కూడా రాజీపడే తత్వం వారికి కనిపించదు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ, ఆ తర్వాత బీఆర్ఎస్‌లోనూ అధిష్ఠానాలతో విభేదించే బయటకు వచ్చారు. తాజాగా కాంగ్రెస్‌లో కూడా తమ పాత ధోరణినే కొనసాగించి సొంత కాళ్లపై గొడ్డలి వేసుకున్నారు. కేబినెట్ నుంచి తప్పించిన వెంటనే వరంగల్ జిల్లాలో ప్రత్యామ్నాయంగా గుండు సుధారాణి, ఇతర బీసీ నేతలను రేవంత్ రెడ్డి తెరపైకి తీసుకురావడంతో క్షేత్రస్థాయిలోనూ కొండా కుటుంబానికి పట్టు సడలే ప్రమాదం ఏర్పడింది. దీంతో సొంత పార్టీలోనే ఉంటూ రాజకీయంగా మనుగడ సాగించడం వారికి దాదాపు అసాధ్యంగా మారింది.ఈ పరిస్థితుల్లో తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి, వరంగల్ కోటపై పట్టు నిలుపుకోవడానికి కొండా దంపతులు కొత్త రాజకీయ గమ్యాన్ని వెతుక్కోక తప్పని పరిస్థితి ఏర్పడింది. వారి ఎదుట మిగిలి ఉన్న ఏకైక బలమైన ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీ మాత్రమే. తెలంగాణలో దూకుడుగా వెళ్తున్న బీజేపీ కూడా ఉమ్మడి వరంగల్‌లో బలమైన మాస్ లీడర్ల కోసం చూస్తున్న వేళ.. కొండా మురళి, సురేఖల చేరిక వైపు అడుగులు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌కు రాంరాం చెప్పి కాషాయ కండువా కప్పుకోవడమే వారి తదుపరి రాజకీయ అస్త్రం అవుతుందన్న చర్చలు జోరందుకున్నాయి

## ఏపీ లో మరో ట్రావెల్ బస్సు దగ్ధం...

### డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సేఫ్



అనంతపురం జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. పెద్దవడుగూరు మండలంలోని మిడుతూరు వద్ద హైవేపై ఓ ప్రైవేట్ బస్సు పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ వల్ల బస్సులో మంటలు చెలరేగాయి. 33 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బస్సు వస్తుండగా.. ఈ ప్రమాదం జరిగింది. బస్సు డ్రైవర్ అప్రమత్తమై ప్రయాణికులను కిందకు దింపేయడంతో పెను ప్రమాదం తప్పింది.

## మానేరు డ్యామ్‌కు జలకళ

కరీంనగర్ కాళేశ్వరం ప్రాజెక్టులోని నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మోటార్లు నేడు ప్రారంభం కావడంతో కరీంనగర్ జిల్లా రైతుల్లో ఆశలు చిగురించాయి. పంప్‌హౌస్‌ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తుండటంతో కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్ (ఒఓఆ)కు జలకళ సంతరించుకుంది. రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్‌హౌస్‌ల మోటార్లను వెంటనే ప్రారంభించి మానేరు డ్యామ్‌ను నీటితో నింపాలని ప్రతిపక్షాలు ప్రభుత్వానికి సూచించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల మోటార్లు ప్రారంభం కావడంతో గోదావరి జలాలు మానేరు డ్యామ్ వైపు తరలుతున్నాయి. దీంతో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో సాగునీటి అవసరాలకు భరోసా కలగడంతో పాటు ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు పెరిగాయి.మానేరు డ్యామ్‌కు నీరు చేరుతుండటంతో కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో జలకళ కనిపిస్తోంది. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ పరిణామం ఊరటనిచ్చింది. కాళేశ్వరం జలాలను సమర్థవంతంగా వినియోగించి మానేరు డ్యామ్‌ను పూర్తి స్థాయిలో నింపి రైతులకు సాగునీటి కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు

## సీఎంగానే అసెంబ్లీలోకా...

హైదరాబాద్, సెప్టెంబర్ 4, సీఎంగానే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని కేటీఆర్ ప్రకటించారు. అంటే ఆయన ఇక అసెంబ్లీకి రారని తేల్చేశారు. అయితే కేటీఆర్ చేసిన ఈ ప్రకటన రాజకీయవర్గాలను ఆశ్చర్యపరిచింది. ఎందుకు ఇంత అహంకారం అన్న ప్రశ్న వస్తోంది. రాజకీయాల్లో ఇలాంటి నిర్ణయాలు కొత్త కాదు కానీ.. పూర్తిగా ప్రజల్ని తక్కువ చేసే ఇలాంటి నిర్ణయం మాత్రం కొత్త. గతంలో ఇలాంటి సవాళ్లు చేసిన వాళ్లు చాలా పక్కాగా చేశారు.రాజకీయాల్లో శపథాలు, ప్రతీకారాలు, సవాళ్లు కేవలం వ్యక్తిగత పంతాలు మాత్రమే కావు. అవి ప్రజలలో ఒక బలమైన భావోద్వేగాన్ని , సానుభూతిని రగిల్చే శక్తివంతమైన ఆయుధాలు. భారత రాజకీయ చరిత్రను ఒక్కసారి తిరగేస్తే.. తమిళనాడు అసెంబ్లీలో తీవ్ర అవమానాన్ని ఎదుర్కొని ముఖ్యమంత్రినయ్యాకే సభలో అడుగుపెడతాను అని ప్రతిజ్ఞ చేసి గెలిచిన జయలలిత, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీలో జరిగిన పరాభవాన్ని తట్టుకుని ప్రజాక్షేత్రంలోకి వెళ్లి తిరిగి అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్, ఇటీవలే వ్యక్తిగత విమర్శలతో నొచ్చుకుని సభ వీడి, అఖండ మెజారిటీతో మళ్లీ సీఎం పీఠంపై కూర్చున్న చంద్రబాబు నాయుడు మనకు కనిపిస్తారు. వీరందరి శపథాల వెనుక ఒక తీవ్రమైన అవమానం, పోరాటం, ప్రజాదరణ సాధించాలనే బలమైన ఆరాటం ఉన్నాయి.కానీ, కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లకపోవడానికి కారణం అలాంటిది కాదు. ఆ నాయకుల వ్యూహాలకు, ఇప్పటి కేసీఆర్ వైఖరికి చాలా తేడా కనిపిస్తోంది. అసెంబ్లీ సభలో కేసీఆర్‌ను ఎవరూ ప్రత్యక్షంగా అవమానించలేదు, సభ నుండి పంపించివేయలేదు. అలాంటి అవకాశం కూడా ఆయన ఇవ్వలేదు. సభకు రాలేదు. కేసీఆర్ సభకు వస్తే ఆయన గౌరవం తగ్గకుండా చూస్తానని రేవంత్ హామీ కూడా ఇచ్చారు. అయినా మనసు మార్చుకోలేదు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత, ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. అయితే, సభకు రాకుండా మళ్లీ సీఎం అయ్యాకే వస్తాను అని వించడం ఏ రకమైన రాజకీయ వ్యూహమో ప్రజలకు అర్థం కావడం లేదు.చరిత్ర సృష్టించిన నాయకులు తమకు జరిగిన అవమానాలను లేదా ఓటములను ప్రజల్లోకి తీసుకెళ్లి, రోజువారీ పోరాటాలతో ప్రజాదరణను తిరిగి పునాదిగా మలచుకున్నారు. చంద్రబాబు కానీ, ఎన్టీఆర్ కానీ శాసనసభకు దూరంగా ఉన్న సమయంలో నిరంతరం ప్రజల్లోనే ఉన్నారు. కానీ, కేసీఆర్ ఓటమి అనంతరం అత్యధిక సమయం ఫామ్ హౌస్‌కే పరిమితమవ్వడం, ప్రజాక్షేత్రంలో చురుగ్గా కనిపించకపోవడం వల్ల ప్రజలు కూడా భావోద్వేగానికి గురయ్యే చాన్స్ లేదు. సీఎం పదవి లభిస్తేనే సభకు వస్తాననడం ప్రజల్లో సానుభూతిని కలిగించకపోగా, బాధ్యతారాహిత్యమనే భావనను పంపే ప్రమాదం ఉంది.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష హోదా అనేది తక్కువదేమీ కాదు. ప్రజాసమస్యలపై అసెంబ్లీ వేదికగా గళమెత్తడమే ప్రతిపక్ష నాయకుడికి అసలైన గౌరవం , బలం. సభకు రాకుండా ఫామ్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటూ, రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారం వస్తుందని ఆశించడం చోద్యంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాదరణ అనేది ఇంట్లో కూర్చుంటే వచ్చేది కాదు, సభ లోపల , బయట ప్రజల తరఫున నిలబడి పోరాడితేనే లభించేది. ఈ విషయాన్ని గ్రహించకుండా కేవలం అధికారం వచ్చాకే అసెంబ్లీకి వస్తా అని పట్టుబట్టడం రాజకీయంగా కేసీఆర్‌కు లాభం కంటే నష్టమే ఎక్కువ చేస్తుంది.

## ఏరో స్పేస్ రంగంలోకి రాఘవ

హైదరాబాద్, సెప్టెంబర్ 4, కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో బిగ్ కంపెనీగా ఉన్న రాఘవ గ్రూప్ ఇప్పుడు డిఫెన్స్ రంగంలోకి అడుగు పెట్టింది. రాఘవ్ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ నూతన హైటెక్ వెంచర్‌ను డీఆర్డీవో మాజీ ఛైర్మన్, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ సతీష్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. రక్షణ రంగంలో భారత్ ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి తమ సంస్థ చేయూతనిస్తుందని పొంగులేటి అంటున్నారు.ఈ నూతన సంస్థ ద్వారా మిసైల్స్ , సైనిక విమానాలు, అంతరిక్ష వ్యోమనౌకలు , రక్షణ రంగ పరికరాల్లో ఉపయోగించే అత్యంత సంక్లిష్టమైన హై-ప్రిసిషన్ విడిభాగాలు , సోలెనోయిడ్ వాల్వ్‌లు , స్పెషలైజ్డ్ మెకానికల్ కాంపోనెంట్లను డిజైన్ చేసి ఉత్పత్తి చేయనున్నారు. హైదరాబాద్‌లోని చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అత్యాధునిక తయారీ ప్లాంట్‌ను ఈ సంస్థ ఇప్పటికే సిద్ధం చేసింది. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ , డిఆర్‌డిఓ వంటి దేశీయ ప్రభుత్వ రక్షణ దిగ్గజాలకు విడిభాగాలను సరఫరా చేయడంతో పాటు, ప్రపంచ స్థాయి ప్రైవేట్ ఏరోస్పేస్ సంస్థల సప్లై చైన్‌లో భాగస్వామ్యం కావడం ఈ ప్లాంట్ ప్రధాన లక్ష్యం.సంస్థ భవిష్యత్ కార్యాచరణపై రాఘవ్ ఏరోస్పేస్ మేనేజింగ్ డైరెక్టర్ పొంగులేటి లిఖిత్ రెడ్డి నమ్మకంతో ఉన్నారు. కేవలం దేశీయ అవసరాలకే పరిమితం కాకుండా, గ్లోబల్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ మార్కెట్‌లోకి ప్రవేశించి అంతర్జాతీయ సంస్థల సరఫరాదారుగా నిలవడమే తమ ప్రాథమిక లక్ష్యమని స్పష్టం చేశారు. పరిశోధన-అభివృద్ధి , కచ్చితత్వంతో కూడిన ఇంజనీరింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ, భవిష్యత్తులో డ్రోన్ టెక్నాలజీ, మిసైల్ ప్రొపల్షన్ సిస్టమ్స్ వంటి అధునాతన విభాగాలకు అవసరమైన విడిభాగాలను కూడా ఉత్పత్తి చేసే దిశగా తమ సంస్థ విస్తరించనుందని బిజినెస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.తెలంగాణలో ఉన్న అనుకూలమైన ఏరోస్పేస్ ఎకోసిస్టమ్ ను ఉపయోగించుకుంటూ రాఘవ్ ఏరోస్పేస్ ఈ రకమైన వ్యూహాత్మక అడుగులు వేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాఘవ్ గ్రూప్ ఇప్పుడు అధిక లాభదాయకత, సాంకేతిక నైపుణ్యంతో కూడిన రక్షణ రంగ ఉత్పత్తుల విభాగంలోకి ప్రవేశించడం ద్వారా తమ బిజినెస్ పోర్ట్‌ఫోలియోను సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రచించింది.

## ఏపీ లో మరో ట్రావెల్ బస్సు దగ్ధం...

### డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సేఫ్

సికింద్రాబాద్లోని ఇస్కాన్ టెంపుల్లో కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఆధ్యాత్మిక శోభతో పరిఢవిల్లుతున్నాయి.

# లక్కవరంలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి



అంబేద్కర్ కోనసీమ మలికిపురంమలికిపురం మండలం లక్కవరం వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా.. మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.స్థానికుల వివరాల ప్రకారం.. భీమవరం నుంచి లక్కవరంలోని ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో కారు అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు మహిళలను స్థానికులు, పోలీసులు సహాయంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.మృతులు, క్షతగాత్రులు లక్కవరం గ్రామానికి చెందిన వారిగా గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల వివరాలు, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది.ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# కత్తులతో పొడుచుకున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తలు

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం గంగన్నపాలెంలో మూడు పార్టీల మధ్య ఘర్షణ చేలరేగింది. కత్తిపోట్లకు దారి తీసిన వైనం.. ముగ్గురు కాంగ్రెస్ కార్యకర్తలు సతీష్, శ్రీకాంత్, నరేష్కు కత్తిపోట్లు తగిలాయి. సతీష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం . గంగన్న పాలెం సెంటర్ లో మూడు పార్టీల కార్యకర్తలు ఘర్షణకు దిగారు. ఓ చిన్న వివాదం కాస్తా ముదిరి కత్తిపోట్లకు దారితీసిన వైనం

# వృద్ధులు, వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

## బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు




**చందుర్తి ప్రజాబలం ప్రతినిధి:** చందుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, మహిళా సదస్సు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై వంటావార్పు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలు తమ పెన్షన్లు, చార్వాక వృద్ధుల ఫౌండేషన్ స్థల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా చల్మెడ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సదస్సుకు 800 మందికి పైగా హాజరయ్యారు.




చల్మెడ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. చార్వాక ఫౌండేషన్ స్థలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడంపై వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను అండగా ఉంటానని తెలిపారు.

# అభివృద్ధి, ప్రజా సమస్యలు, మౌలిక వసతులపై చర్చించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్




**పెద్దపల్లి/గోదావరిఖని, సెప్టెంబర్–4, ప్రజాబలం ప్రతినిధి :** రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అంతర్గాం మండల ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, మౌలిక వసతులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సూచించారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన.. కబ్జాలు, కుంభకోణాలు, సెటిల్మెంట్లకే పరిమితం

**వెయ్యి పడగలతో అవినీతి విస్తరణ.. కమిషన్లు రావనే కేసీఆర్ సంక్షేమ పథకాలన్నింటికీ మంగళం**

**మళ్లీ వచ్చేది కేసీఆర్ సర్కారే.. బెల్లంపల్లి వంటావార్పులో బీఆర్ఎస్ శ్రేణులకు హరీశ్ రావు పిలుపు.**

మంచిర్యాల కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను నిరసిస్తూ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటావార్పు నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్ రావు.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, మోసపూరిత విధానాలపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసి, కమిషన్ల కోసమే కాంగ్రెస్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో ఏం జరిగిందని చూస్తే.. అంతా కబ్జాలు, కుంభకోణాలు, లూటీలు, సెటిల్మెంట్లే తప్ప పాలన ఎక్కడా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వెయ్యి రోజుల రేవంత్ పాలనలో అభివృద్ధి మటుమాయమైపోయింది. వెయ్యి పడగలతో అవినీతి రాజ్యమేలుతోంది.ఈ రాష్ట్రంలో పేదల సంక్షేమం పూర్తిగా బందైపోయింది. కేసీఆర్ గారు ప్రవేశపెట్టిన పథకాల వల్ల కమిషన్లు రావన్న ఒకే ఒక్క కారణంతో వాటన్నింటినీ రేవంత్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా ఎత్తేసిందని అన్నారు.

రైతుబంధు నిర్వీర్యమైంది, రైతుబీమా ఎగ్గొట్టారు, కేసీఆర్ కిట్ బంద్ చేశారు, గొర్రెల పంపిణీ పథకం ఆపేశారు, చేప పిల్లల పథకాన్ని గాలికొదిలేశారు, బీసీ బంధు జాడ లేదు, దళితబంధు పత్తా లేకుండా పోయింది. రేవంత్ పాలన అంతా కేవలం కమిషన్ల చుట్టూనే తిరుగుతోంది. ఎన్నికల ముందు వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, అవ్వాతాతలకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామని ఊదరగొట్టారు. కేసీఆర్ గారు అధికారంలో ఉన్నప్పుడు మాట తప్పకుండా రూ.200 ఉన్న పెన్షన్ను మొదటి నెలలోనే రూ.2,000 చేసిన గొప్ప నాయకుడు. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి 33 నెలలు పూర్తయినా.. ఒక్క వికలాంగుడికి, ఒక్క వితంతువుకి, ఒక్క వృద్ధుడికి కూడా కొత్త పెన్షన్ ఇవ్వలేదని అన్నారు.

కేసీఆర్ ఏకంగా 42 లక్షల మంది పేదలకు నెలనెలా రూ.2,000 గౌరవప్రదంగా పెన్షన్ అందిస్తే.. రేవంత్ రెడ్డి కొత్త పెన్షన్లు ఇవ్వకపోగా, ఉన్నవాటిలో ఏకంగా మూడున్నర లక్షల పెన్షన్లను నిర్దాక్షిణ్యంగా రద్దు చేసి పేదల కడుపు కొట్టాడు. రేవంత్ రెడ్డి నిత్యం ఆంధ్రప్రదేశ్ ఆదర్శం అంటాడు, ఆయన గురువు గారిని ఆదర్శంగా తీసుకుంటానని చెబుతాడు. మరి నీ గురువు గారు ఆంధ్రప్రదేశ్లో గెలిచిన మొదటి నెలలోనే 4,000 పెన్షన్ ఇస్తున్నప్పుడు.. 33 నెలలైనా నువ్వు తెలంగాణలో ఎందుకు ఇవ్వడం లేదు? వృద్ధుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ రేవంత్ సర్కార్ను నిలదీస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చూస్తే.. గత 33 నెలలుగా నెలకు రూ.2,000 చొప్పున ఇప్పటివరకు ప్రతి అవ్వకు, తాతకు కాంగ్రెస్ సర్కార్ ఏకంగా రూ.66,000 బాకీ పడింది. ఇప్పుడే పెన్షన్లు పెంచితే ఎన్నికల నాటికి మర్చిపోతారట.. అందుకే ఎన్నికలకు ఆరు నెలల ముందో, మూడు నెలల ముందో రూ.4,000 చేస్తామని రేవంత్ రెడ్డి జాదా ఉషారు, అతితెలివితేటలు ప్రదర్శిస్తున్నాడని అన్నారు.కానీ తెలంగాణ ప్రజలు నీకంటే తెలివైనవాళ్లు. ఎన్నికల ముందు నువ్వు ఇచ్చినా తీసుకుంటారు, కానీ బాకీ పడ్డ మొత్తం రూ.66 వేలు లెక్క తేల్చిన తర్వాతే రేవంత్ రెడ్డిని నిలదీస్తారు. రేవంత్ రెడ్డి పాలన అంతా గాలి మాటలకే పరిమితమైంది. అయితే బూతు పురాణం మాట్లాడటం, లేదంటే ప్రభుత్వ భూములను అడ్డగోలుగా అమ్ముకోవడం.. ఇంతకుమించి ఈ ప్రభుత్వంలో ఇంకేమైనా పాలన ఉందా? కనబడ్డ దేవుళ్ల మీదల్లా ఒట్లు పెట్టి.. చివరికి రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకుండా రైతులను నట్టేట ముంచారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో మోసాలు, కుంభకోణాలు, ప్రమాణాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు.

# పిఠాపురం ఆడపడుచులకు పవన్ కళ్యాణ్ శ్రావణ మాస కానుక

**10 వేల మంది మహిళలకు చీరలు, పసుపు, కుంకుమలు పంపిణీ**

**శ్రీ పురుహూతిక అమ్మవారి సన్నిధిలో వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు**

**భక్తుల సౌకర్యార్థం పకడ్బందీ ఏర్పాట్లు**

**భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న నియోజకవర్గ మహిళలు**



పిఠాపురం ప్రజలతో, ముఖ్యంగా నియోజక వర్గంలోని ఆడపడుచులతో తనకున్న అనుబంధాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరోసారి చాటి చెప్పారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా నియోజకవర్గంలోని దాదాపు 10 వేల మంది ఆడపడుచులకు చీరలు, పసుపు, కుంకుమలను శ్రావణ మాస కానుకగా అందించారు. పిఠాపురంలోని ప్రముఖ శక్తి పీఠమైన శ్రీ పురుహూతిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆడపడుచుల కోసం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. వ్రతానికి అవసరమైన పూజా సామగ్రిని ఉచితంగా అందించడంతో పాటు, వేద పండితుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేలాది మంది మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొని అమ్మవారిని పూజించారు. భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాచరణశ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ కుక్కుటేశ్వర స్వామి, శ్రీ పురుహూతిక అమ్మవారి దివ్యక్షేత్రంలో వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో వ్రత పూజల్లో పాల్గొన్నారు.

వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వరలక్ష్మీ దేవిని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు), పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం గణపతి పూజ, కలశ పూజతో పాటు అమ్మవారికి అష్టోత్తర శతనామావళి, వరలక్ష్మీ స్తోత్రాలు, షోడశోపచార పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వరలక్ష్మీ వ్రత మహిమను వివరిస్తూ వ్రతకథను భక్తులకు వినిపించారు. నాలుగు విడతలుగా జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రత పూజల్లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది మహిళలు పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, ఆలయ మరియు మున్సిపల్ సిబ్బంది, జనసేన పార్టీ వాలంటీర్లు, సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందించేందుకు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని కూడా అందుబాటులో ఉంచారు. ఐదు విడతలుగా వరలక్ష్మీ వ్రతమాచరించిన మహిళలువరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించేందుకు వేలాది మంది మహిళా భక్తులు తరలిరావడంతో వేద పండితులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మహిళలతో ఐదు విడతలుగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరింపజేశారు. తొలి విడతలో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు వ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రెండో విడతను ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించారు. మూడో విడతలో ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, నాలుగో విడతలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, ఐదో విడత 10 గంటల నుంచి 11 వరకు వేద పండితులు మహిళలతో వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహింపజేశారు. ఏటా జరిగే విధంగానే సంప్రదాయాన్ని గౌరవిస్తూ సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించిన ఆడపడుచులకు పవన్ కళ్యాణ్ పసుపు, కుంకుమ, చీరలను కానుకగా పంపించారు. ఈ కానుకలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ , పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామస్వామి , పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండం దొరబాబు, ఫైవ్ మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిశోర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చల్లా లక్ష్మి, జనసైనికులు, వీరమహిళలు పర్యవేక్షించారు.

# నిరుద్యోగ యువతను టార్గెట్ చేస్తున్న మోసగాళ్ళు

## (హెచ్.ప్రతాప్)

ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ఒక యువకుడికి ప్రభుత్వ ఉద్యోగం లభించబోతోందన్న మాట ఎంతటి ఆశను కలిగిస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ ఆశనే పెట్టుబడిగా చేసుకుని మోసగాళ్లు సాగిస్తున్న దందాలు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ఆదిలాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఒక వ్యక్తి నుంచి రూ.2 లక్షలు తీసుకున్న మహ్మద్ రఫీక్‌ను పోలీసులు అరెస్టు చేసిన ఘటన ఇందుకు తాజా ఉదాహరణ. రహదారులు, భవనాల శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదు అందడంతో పోలీసులు చర్యలు చేపట్టారు.

ఇది ఒక వ్యక్తి మోసానికి సంబంధించిన ఘటనగా మాత్రమే చూడటం సరిపోదు. ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి చదివి, పరీక్షలు రాసి, అవకాశాల కోసం ఎదురుచూస్తున్న యువతలోని ఆతృతను కొందరు మోసగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు ఉన్న సామాజిక భద్రత, గౌరవం, స్థిరమైన ఆదాయం వంటి అంశాలు ఇలాంటి మోసాలకు మరింత అవకాశం కల్పిస్తున్నాయి.

దేశంలో యువత ఉపాధి సమస్య ఇంకా ఒక ముఖ్యమైన సవాలుగానే ఉంది. 2025లో విడుదలైన ఆవర్తిత శ్రామిక శక్తి సర్వే ప్రకారం 15--29 ఏళ్ల వయసు గల యువతలో నిరుద్యోగిత రేటు దేశవ్యాప్తంగా గణనీయంగా ఉంది. రాష్ట్రాల మధ్య కూడా భారీ వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇదే వయసు వర్గానికి 2025లో సాధారణ స్థితి ఆధారిత నిరుద్యోగిత రేటు 16.2 శాతంగా నమోదైంది.

ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని నకిలీ నియామక సంస్థలు, తప్పుడు ప్రకటనలు, నకిలీ నియామక పత్రాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసే ముఠాలు చురుగ్గా వ్యవహరిస్తున్నాయి. కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖే 2025లో ప్రభుత్వ పథకం పేరుతో నకిలీ నియామక వెబ్‌సైట్లు నడుపుతున్న విషయాన్ని వెల్లడించింది. తప్పుడు నియామక ప్రకటనల ద్వారా డబ్బులు అడిగే మోసాలపై పోస్టల్ శాఖ, విమానాశ్రయాల ప్రాధికార సంస్థ కూడా ప్రజలను అప్రమత్తం చేశాయి.

అందువల్ల మోసగాళ్లపై చర్యలు కేవలం అరెస్టులతో ముగియకూడదు. నకిలీ నియామక సంస్థలపై ప్రత్యేక దర్యాప్తు వ్యవస్థ, అనుమానాస్పద నియామక ప్రకటనలపై వేగవంతమైన విచారణ, అక్రమంగా వసూలు చేసిన మొత్తాల స్వాధీనం, నకిలీ ప్రకటనల ప్రచార మార్గాల నిరోధం అవసరం. ప్రతి ప్రభుత్వ ఉద్యోగ ప్రకటనకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఒకే చోట సులభంగా అందుబాటులో ఉంచడం కూడా ఉపయోగకరం.

అదే సమయంలో యువతకు అవకాశాలు పెంచడం మరింత ముఖ్యమైన పరిష్కారం. ప్రభుత్వ రంగ నియామకాలతో పాటు తయారీ, సేవలు, చిన్న పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, నైపుణ్య ఆధారిత ఉపాధి, స్వయం ఉపాధి రంగాలను విస్తరించాలి. నైపుణ్య శిక్షణకు అనుసంధానమైన ఉద్యోగాలు, పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల తయారీ, గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక ఉపాధి అవకాశాల సృష్టిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

యువత కూడా అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగానికి ముందస్తుగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదనే అవగాహన ప్రతి ఉద్యోగార్థికి ఉండాలి. ఏ నియామక సమాచారమైనా సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారిక ప్రకటనతో సరిపోల్చి చూసిన తర్వాతే స్పందించాలి. తప్పుడు నియామక పత్రాలు లేదా డబ్బు డిమాండ్ కనిపిస్తే వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. కేంద్ర ప్రభుత్వం కూడా నకిలీ నియామక ప్రకటనల విషయంలో అధికారిక మార్గాల ద్వారానే సమాచారాన్ని నిర్ధారించుకోవాలని పదేపదే సూచిస్తోంది.

యువత ఉద్యోగం కోసం ఎదురుచూసే పరిస్థితిని మోసగాళ్లకు అవకాశంగా మారనివ్వకూడదు. నకిలీ ఉద్యోగాలపై ఉక్కుపాదం, నిజమైన ఉద్యోగాలపై వేగవంతమైన సృష్టి---ఈ రెండూ సమాంతరంగా సాగాలి. యువత ఆశలను కాపాడటం అంటే కేవలం మోసగాళ్లను శిక్షించడం కాదు; ఆ ఆశలు నిజమయ్యే అవకాశాలను సృష్టించడం కూడా. ఒక యువకుడి చేతిలో నకిలీ నియామక పత్రం కాకుండా నిజమైన ఉద్యోగ నియామక పత్రం పెట్టినప్పుడే దేశ యువశక్తికి పూర్తి న్యాయం జరిగినట్టవుతుంది.

# డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ముడియం చిన్ని ఎన్నిక.

బద్వేలు  భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు ఈనెల 1 2 3 తేదీలలో నెల్లూరు నగరంలో నిర్వహించడం జరిగిందని ఈ రాష్ట్ర మహాసభలలో బద్వేల్ పట్టణానికి చెందిన ముడియం చిన్నిని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీకి ఎన్నిక చేయడం జరిగిందని ఎన్నిక చేసిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్నికైన ముడియం చిన్ని మాట్లాడుతూ.... రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులు ఉద్యోగ అవకాశాలు లేక ఇతర దేశాలకు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారని వారు తెలిపారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు నిరుద్యోగ యువతీ యువకులకు మేం అధికారంలోకి వస్తే ప్రత్యేక జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ జిల్లాలో సేయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఈ జిల్లాకు కొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని దాని ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దానికి వీలుంటుందని వారు తెలిపారు నిరుద్యోగ సమస్యల పైన పోరాడుతున్నటువంటి ఏకైక యువజన సంఘం డివైఎఫ్ఐ మాత్రమేనని వారన్నారు నిరుద్యోగులు సమస్యలతో పాటు జిల్లాలో పరిశ్రమల కోసం ఉపాధి అవకాశాల కోసం జిల్లా అభివృద్ధి కోసం డివైఎఫ్ఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు ఈ రాష్ట్ర కమిటీ ఎన్నిక చేసినటువంటి ఆలిండియా నాయకత్వానికి రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేసుకోవడం జరిగిందన్నారు

# ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ. కుమార్‌కు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కారం




హైద్రాబాద్ సెప్టెంబర్ 4: విద్యార్థులను విజ్ఞానవంతులుగా, బాధ్యతాయుతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు అమూల్యమైన పాత్ర పోషిస్తారని ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. కుమార్ అన్నారు.జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం మరియు భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శుక్రవారం, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ నివాస భవనంలో తెలంగాణ ఇంటెలెక్చువల్స్ ఫోరం, రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి

ప్రొఫెసర్ ఎం. కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉపాధ్యాయులు లేని జీవితం అసంపూర్ణమని, ఉపాధ్యాయుల ఆశీర్వాదాలు, మార్గదర్శకత్వం జీవితంలో సరైన మార్గాన్ని చూపిస్తాయని ప్రొఫెసర్ కుమార్ అన్నారు.ఉపాధ్యాయులు కేవలం విద్యను మాత్రమే కాకుండా, అర్థవంతమైన జీవితానికి అవసరమైన క్రమశిక్షణ, కరుణ, మంచి నడవడికలను కూడా అందిస్తారని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ అన్నారు.

ఈ సందర్భంగా, తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ. కుమార్‌ను శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరించి, విద్యా రంగంలో మూడు దశాబ్దాలకు పైగా ఆయన చేసిన అంకితభావ సేవకు, ఉపాధ్యాయుడిగా ప్రస్థానం నుంచి వైస్-ఛాన్సలర్ వరకు సాగిన ప్రస్థానానికి గుర్తింపుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు.ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, ప్రొఫెసర్ శేఖర్, ప్రొఫెసర్ బి. శ్రీనగేష్, ప్రొఫెసర్ మంగు, ప్రొఫెసర్ భాగ్యవతి, డాక్టర్ రవితేజ, డాక్టర్ అక్తర్ అలీ, డాక్టర్ ఎ. అనిత, డాక్టర్ పి.సుప్రియ, మేజర్ ఎస్‌కె శివప్రసాద్, ఎట్టా ఉదయశ్రీ రెడ్డి, బిచ్చుగుడి రాంరెడ్డి, కోఆర్డినేటర్‌లు జితేందర్ కుమార్ నాయక్, బిచ్చుపాక రాంరెడ్డి, కోఆర్డినేటర్లు జి. మరికొందరు, ప్రొఫెసర్ కుమార్‌ను శాలువాలు, పూల మాలలు మరియు జ్ఞాపికలతో సత్కరించారు.

# సీఎం సభ స్థలాన్ని పరిశీలించిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం

నకిరేకల్ నియోజకవర్గంలో నిర్వహించనున్న వెయ్యి రోజుల ప్రజా పాలన – వికాస సభ" ఏర్పాట్లలో భాగంగా, సభా ప్రాంగణాన్ని మరియు బహిరంగ సభ స్థలాన్ని భువనగిరి పార్లమెంట్ సభ్యులు  చామల కిరణ్ కుమార్ రెడ్డి , నకిరేకల్ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్  వేముల వీరేశం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.




చామల మాట్లాడుతూ, రేపు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి  ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో నకిరేకల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మరియు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సభకు భారీ సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు మరియు అభిమానులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, ఎలాంటి అసౌకర్యం కలగకుండా



ప్రాంగణంలో కల్పించాల్సిన సౌకర్యాలు, వేదిక నిర్మాణం, పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ మరియు భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు మరియు నాయకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజులుగా కేసీఆర్ మొద్దు నిద్రలో: కాంగ్రెస్







**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్: ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మోతా రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గాంధీభవన్ నుంచి గన్‌పార్క్ వరకు ర్యాలీ నిర్వహించి, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీరును నిరసించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఫొటోతో కుంభకర్ణుడి భారీ కటౌట్‌ను ఏర్పాటు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు.

కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, "ప్రజలకు దూరంగా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్ వెయ్యి రోజులుగా మొద్దు నిద్రలో ఉన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని కేసీఆర్ ఇప్పటికైనా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి" అని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, మాజీ కార్పొరేటర్లు రమణ గౌడ్, సంతోష్ గుప్తా, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యదర్శి  ఎస్.ధన్‌రాజ్ , సంగీత యాదవ్, సీనియర్ నాయకులు పండిట్ తివారీ, కనయ్య లాల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు హరిదర్, రాహుల్, అలాగే యూత్ కాంగ్రెస్, NSUI డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.




**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:**వెయి రోజులు కుంభకర్ణుడిల ఫార్మ్‌హౌస్ లో ఉన్న కె సి ఆర్ వెంటేనే రాజీనామా చేయాలి ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మోత రోహిత్ ముధిరాజ్  అధ్వర్యం లో గాంధీ భవన్ నుండి గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ ఎగ్జిబిషన్ గ్రౌండ్ డివిజన్ ప్రెసిడెంట్ ముంద్రాయి శ్రీనివాస్ మహమ్మద్ ఆరిఫ్ డి సి సి ప్రధాన కార్యదర్శి వి రాజేష్ ఉదయ్ సాయి మరియు వందలాది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# టీచర్స్ ఎక్స్పోజర్‌లి విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్ఛ్సేంజ్ ప్రోగ్రాం "



ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 4 ఏటూరు నాగారం జపాన్ దేశంలో విద్యా వ్యవస్థను అధ్యయనం చేయడానికి ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలం లోని జడ్పీహెచ్ఎస్ రామన్నగూడెం పాఠశాల హెడ్మాస్టర్ కొయ్యడ మల్లయ్య ఈనెల 06.09.2026 నుండి 12.09.2026 వరకు జపాన్ దేశంలో పర్యటించి అక్కడ ఉన్నటువంటి పాఠశాల విద్యా వ్యవస్థను పరిశీలించి, పరిశోధన చేసి రావడానికి 40మంది సభ్యుల బృందంతో జపాన్ బయలుదేరుతున్నారు ఈ సందర్భంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ నవీన్ నికోలస్ అసిస్టెంట్ డైరెక్టర్ లింగయ్య ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ జి.రమేష్ , ఎస్సీఈఆర్టీ హైదరాబాదులో ఈనెల 2వ తారీఖు నాడు వీరందరికీ వీసాలు అందజేసారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పాఠశాల విద్యను అభివృద్ధి చేయడానికి నూతన పద్ధతులను, విధి, విధానాలను, అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి రావాలని సూచించారు, జపాన్ పర్యటనకు వెళ్లే బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు, అలాగే ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి అభినందనలుడ శుభాకాంక్షలు తెలియజేశారు.

# హత్యయత్నం కేసులో ఇద్దరి నిందితుల అరెస్టు



జహీరాబాద్, సెప్టెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి: వివాహితతో అక్రమ సంబంధం కొనసాగించి, ఆమె భర్తను హత్య చేసేందుకు కుట్ర పన్నిన ఇద్దరు నిందితులను జహీరాబాద్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై లవకుమార్ తెలిపిన వివరాల ప్రకారం. కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన కొనగారి వినయ్‌కుమార్‌కు సుమారు రెండున్నరేళ్ల క్రితం తోరమామిడి గ్రామానికి చెందిన బంటు స్వాతితో వివాహమైంది. అయితే స్వాతికి వివాహానికి ముందే తన బావ నాగరిగారి ప్రవీణ్‌కుమార్‌తో ప్రేమ వ్యవహారం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయినప్పటికీ, వివాహం తర్వాత కూడా ప్రవీణ్‌కుమార్ స్వాతితో సంబంధం కొనసాగించినట్లు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న వినయ్‌కుమార్ తన భార్యకు దూరంగా ఉంటున్నాడు. కొంతకాలంగా ప్రవీణ్‌కుమార్ వినయ్‌కుమార్‌కు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడటంతో పాటు, వాయిస్ మెసేజ్‌లు, ఫొటోలు పంపుతూ మానసికంగా వేధించినట్లు పోలీసులు తెలిపారు. వినయ్‌కుమార్‌ను హత్య చేస్తే తమకు అడ్డంకి ఉండదని భావించిన ప్రవీణ్‌కుమార్ తన పెద్దమ్మ కుమారుడైన మరో ప్రవీణ్‌కుమార్‌తో కలిసి హత్యకు పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 9న సాయంత్రం సుమారు 7.30 గంటలకు ఇద్దరూ జహీరాబాద్‌లోని చెన్నారెడ్డి కాలనీకి వెళ్లి వినయ్‌కుమార్‌తో గొడవకు దిగారు. అనంతరం ఏ-2 ప్రవీణ్‌కుమార్ వెనుక నుంచి వినయ్‌కుమార్‌ను పట్టుకోగా, ఏ-1 నాగరిగారి ప్రవీణ్‌కుమార్ తన వెంట తెచ్చుకున్న కమ్మ కత్తితో అతడి వీపుపై దాడి చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో వినయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు నాగరిగారి ప్రవీణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ లను సెప్టెంబర్ 4న అరెస్టు చేశారు. అనంతరం ఇద్దరినీ కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు ఎస్సై లవకుమార్ తెలిపారు.

# ఇంట్లో చోరీ.. నిందితురాలు అరెస్టు

## బంగారు, వెండి ఆభరణాల చోరీ.. సొత్తు రికవరీ



జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలో ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేసిన నేరస్తురాలిని పోలీసులు అరెస్టు చేసి, చోరీ సొత్తును రికవరీ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 3న మధ్యాహ్నం 3 గంటల సమయంలో జహీరాబాద్ టౌన్ పరిధిలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో జయశ్రీ ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించింది. అనంతరం బీరువా తాళం ధ్వంసం చేసి రెండు మాసాల బంగారు పుసల దండ, 20 తులాల వెండి పట్ట గొలుసులు, రెండు జతల వెండి కడియాలు చోరీ చేసింది. ఘటనపై కేసు నమోదు చేసిన జహీరాబాద్ టౌన్ ఎస్సై లవకుమార్ దర్యాప్తు చేపట్టి కర్ణాటక రాష్ట్రానికి చెందిన నిందితురాలు జయశ్రీని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.అనంతరం నిందితురాలిని కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

# కొంశెట్పల్లి నుండి మర్పల్లి నిరసన ర్యాలీకార్యక్రమంలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ నాయకులు



వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండలం మర్పల్లి టౌన్ లో మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్,శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో 6 గ్యారంటీల అమలుపై ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని పెద్ద ఎత్తున ర్యాలీ కార్యక్రమము నిర్వహించడం జరిగింది ర్యాలీ కార్యక్రమానికి పెద్దలు మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు నాయబ్ గౌడ్ మన్నెసుధాకర్ యాదవ్, వీరేశం గౌడ్, గ్రామ పెద్దలు యువకులు పెద్ద ఎత్తున ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నట్లు మన్నే సుధాకర్ యాదవ్ తెలిపారు



# మర్పల్లిలో ఆరు గ్యారెంటీ లపై పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ





వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 4(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లి మండల స్థాయిలో మండల అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారుతెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ప్రతిష్ఠాత్మక సంక్షేమ పథకాలలో భాగంగా ఆర్థిక సహాయం - ఆసరా పింఛన్ల క్రింద వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత-గీత కార్మికులు, ఎయిడ్స్ రోగులకు నెలకు 2016/- వికలాంగులకు 3016/- పెన్షన్ అందించిన పథకం కాగా, కళ్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ ద్వారా పేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లి ఖర్చుల కోసం 1,00,116 ఆర్థిక సాయం, దళిత బంధు ద్వారా దళిత కుటుంబాలు సొంతంగా వ్యాపారాలు లేదా ఉపాధి మార్గాలు ఎంచుకోవడానికి 10 లక్షల చొప్పున 100 శాతం ఉచిత గ్రాంటు అందించడం. బీసీ బంధు ద్వారా వెనుక బడిన కులాల యొక్క కులవృత్తుల అభివృద్ధి కోసం లక్ష చొప్పున ఆర్థిక సాయం చేయడం. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేసుకున్న మహిళలకు ఆర్థిక సాయంతో పాటు శిశువు సంరక్షణకు అవసరమైన 16 రకాల వస్తువులతో కూడిన ఆరోగ్యం, మహిళా సంక్షేమం పేర కే.సి.ఆర్ కిట్లు అందించడం. ఆరోగ్య లక్ష్మి ద్వారా గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ పిల్లలకు ప్రతి రోజూ పోషకాహార భోజనాన్ని కే.సి.ఆర్ న్యూట్రిషన్ కిట్ ద్వారా అందించే కార్యక్రమం. గర్భిణుల్లో రక్తహీనతను తగ్గించేందుకు పోషకాలతో కూడిన ప్రత్యేక కిట్లను పంపిణీ చేయడం. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరికీ కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు మరియు కళ్లద్దాలు పంపిణీ చేయడం వంటి చర్యలకు పాల్పడగా, ఇట్టి ప్రతిష్ఠాత్మక సంక్షేమ పథకాలు పలికిన అడ్డగోలు మాటలు నమ్మినందుకు 1000 రోజుల రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందని, ఈ సందర్భంగా ప్రతీ చోటా కలిసిన శానిటేషన్ సిబ్బందికి జీతాలు సమయానికి రావడంలేదని, కొంతమందికి ఒక నెల, మరి కొంతమందికి రెండు, మూడు నెలలుగా జీతాలు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారని వికారాబాద్,డివిజన్ నాయకులు తెలుపుతూ తమ నిరసన కార్యక్రమం కొనసాగించారు కార్యక్రమానికి ముఖ్య అతిథులు మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, శుభ ప్ర దు పటేల్, మరియు పెద్దలు మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పీటిసి మధుకర్, మాజీ ఎంపీపీ రమేష్, మాజీ ఎంపిటిసిలు మాజీ సర్పంచులు నూతన సర్పంచులు టౌన్ ప్రెసిడెంట్ గఫర్, వైస్ ప్రెసిడెంట్ డి అశోక్, రమేష్ మిత్ర, సోహెల్ షరీఫ్, మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు నాయబ్ గౌడ్,యువ నాయకుడు శ్రీకాంత్, యువ నాయకుడు చంటి, వివిధ గ్రామాల నాయకులు పెద్దలు కార్యకర్తలు పెద్ద ఎత్తున సమావేశంలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియపరుస్తున్నాను అని మర్పల్లి మండల ప్రెసిడెంట్ రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు

# ఘనంగా శ్రీకాష్ణాష్టమి వేడుకలు

## నృత్యాలతో అలరించిన నార్త్ స్కూల్ విద్యార్థినులు



ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 04 ఏటూరు నాగారం ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఇస్కాన్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించారు. ప్రభుదాస్, రవితేజ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలను నిర్వహించారు. అనంతరం పుష్పాభిషేకం చేపట్టారు. కృష్ణుడు మన సంస్కృతి సంప్రదాయాలలో ఎంత వరకు భాగస్వాములు అయ్యారని వారు వివరించారు. గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అదేవిధంగా నార్త్ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని కృష్ణుడు, రాధా వేషాలతో అలరించి భక్తి పాటలకు నృత్యాలు వేశారు.

దీంతో ఆలయం అంతా కూడా మార్మోగింది. పెద్ద ఎత్తున భక్తులు రావడంతో అంగరంగ వైభవంగా వేడుకలు జరిగాయి.

01 రామాలయంలో రాధాకృష్ణులకు అభిషేకం చేస్తున్న రవితేజ, ప్రభుదాస్

2. నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

03 హాజరై న భక్తులు

## ఆర్‌జీ--1 ఏరియా స్పోర్ట్స్ కమిటీ నియామకం



పెద్దపల్లి/గోదావరిఖని, సెప్టెంబర్ 4, ప్రజాబలం ప్రతినిధి : సింగరేణి రామగుండం ఏరియా--1లో 2026--27 సంవత్సరానికి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ & గేమ్స్ అసోసియేషన్ కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షులుగా జీఎం డి.లలిత్ కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా కె.చంద్రశేఖర్, చీఫ్ కో-ఆర్డినేటర్‌గా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, కార్యదర్శిగా గుర్రం హనుమంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్‌గా గండ్ర రాజయ్య నియమితులయ్యారు.

కబడ్డీ, ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, చెస్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ తదితర క్రీడలకు కెప్టెన్లను కూడా నియమించారు. ఆర్జీ--1 ఏరియాలో క్రీడలను మరింత ప్రోత్సహించి, క్రీడాకారులు ఉన్నత స్థాయిలో ప్రతిభ కనబరిచేలా కృషి చేయనున్నట్లు తెలిపారు.

# కోతి కొమ్మచ్చి మాదిరి బడుగు బలహీన వర్గాలకు అందని సంక్షేమ పథకాలు



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 4 సెప్టెంబర్ 2026**తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలలో భాగంగా ఆర్థిక సహాయం - ఆసరా పింఛన్ల క్రింద వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు,



నేత-గీత కార్మికులు, ఎయిడ్స్ రోగులకు నెలకు 2016/- వికలాంగులకు 3016/- పెన్షన్ అందించిన పథకం కాగా, కల్యాణ లక్ష్మి / షాదీ ముబారక్ ద్వారా పేద కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లి ఖర్చుల కోసం 1,00,116 ఆర్థిక సాయం, దళిత బంధు ద్వారా దళిత కుటుంబాలు సొంతంగా వ్యాపారాలు లేదా ఉపాధి మార్గాలు ఎంచుకోవడానికి 10 లక్షల



చొప్పున 100 శాతం ఉచిత గ్రాంటు అందించడం. బీ.సీ బంధు ద్వారా వెనుక బడిన కులాల యొక్క కులవృత్తుల అభివృద్ధి కోసం లక్ష చొప్పున ఆర్థిక సాయం చేయడం. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేసుకున్న మహిళలకు ఆర్థిక సాయంతో పాటు శిశువు సంరక్షణకు అవసరమైన 16 రకాల వస్తువులతో కూడిన ఆరోగ్యం, మహిళా సంక్షేమం పేర కే.సి.ఆర్ కిట్లు అందించడం. ఆరోగ్య లక్ష్మి ద్వారా గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ పిల్లలకు ప్రతి రోజూ పోషకాహార భోజనాన్ని కే.సి.ఆర్ న్యూట్రిషన్ కిట్ ద్వారా అందించే కార్యక్రమం. గర్భిణుల్లో రక్తహీనతను తగ్గించేందుకు పోషకాలతో కూడిన ప్రత్యేక కిట్లను పంపిణీ చేయడం. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరికీ కంటి



వెలుగు పథకం ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు మరియు కళ్లద్దాలను పంపిణీ చేయడం వంటి చర్యలకు పాల్పడగా, ఇట్టి ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలు మణికొండ, నెక్నాంపూర్ మున్సిపల్ డివిజన్లలోని పాషా కాలనీ, గోల్కొండ కోహినూరు కాలనీ, బాపు హిల్స్, శివాజీ నగర్, మణికొండ క్వార్టర్స్ ప్రజలకు అందుబాటులో ఉన్నవా ? లేవా అనే సందేహాత్మక పర్షిలనార్థం భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు, మద్దతుదారులు, సానుభూతి పరులు శుక్రవారం రోజున పర్యటించగా, కాంగ్రెస్ పలికిన అడ్డగోలు మాటలు నమ్మినందుకు 1000 రోజుల రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందని, ఈ సందర్భంగా ప్రతీ చోటా కలిసిన శానిటెశన్ సిబ్బందికి జీతాలు సమయానికి రావడంలేదని, కొంతమందికి ఒక నెల, మరి కొంతమందికి రెండు, మూడు నెలలుగా జీతాలు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారని భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపుర్ డివిజన్ నాయకులు తెలుపుతూ తమ నిరసన కార్యక్రమం కొనసాగించారు.

## జహీరాబాద్‌లో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





**జహీరాబాద్, సెప్టెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి:** పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భవాని మందిర్ చౌరస్తాలో గొల్ల కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. మాణిక్ ప్రభు పాఠశాలకు చెందిన చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ప్రత్యేకంగా అలంకరించుకుని వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారుల సందడి మధ్య భవాని మందిర్ చౌరస్తాలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు ఉట్టిని పగలగొట్టి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చౌరస్తా పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గొల్ల కురుమ యాదవ సంఘం నాయకులు, సభ్యులు, స్థానికులు పాల్గొని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## టీ వై జె ఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా చెల్మెడ అనిల్ కుమార్ నియామకం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 04 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** (టీ వై జె ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు "డా, తనుగుల జితేందర్ రావు" ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, "షేక్ మహబూబ్ "ఆధ్వర్యంలో చెల్మెడ అనిల్ కుమార్ ను, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమించారు, ఈ సందర్భంగా ఆయనకు నియమాక పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, యువ జర్నలిస్టుల సంక్షేమం కోసం( టీ వై జె ఎఫ్ ) మరింత బలోపేతంగా పనిచేయాలని, ఆకాంక్షించారు, తనకు అప్పగించిన బాధ్యతలను, సమర్ధవంతంగా నిర్వహిస్తూ, ఫెడరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని, చెల్మెడ అనిల్ కుమార్ ను అభినందించారు, ఈ కార్యక్రమంలో (టీవైజెఎఫ్) సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కామగల నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ గుప్తా, పట్టణ ఉపాధ్యక్షులు మహేందర్, తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో నాగుపాము కలకలం



**జహీరాబాద్, సెప్టెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి:** పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నాగుపాము ప్రత్యక్షం కావడంతో శుక్రవారం కలకలం రేగింది. ఆసుపత్రిలోని ప్రసూతి వార్డు సమీపంలో పాము కనిపించడంతో రోగులు, వారి సహాయకులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. పాము అటూ ఇటూ సంచరిస్తుండటాన్ని గమనించిన కొందరు రోగులు, బంధువులు భయంతో పరుగులు తీశారు.

విషయం తెలుసుకున్న ఆసుపత్రి సిబ్బంది వెంటనే అప్రమత్తమై పామును హతమార్చి ఆసుపత్రి బయటకు తీసుకెళ్లారు. దీంతో రోగులు, వారి బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ప్రసూతి వార్డు సమీపంలోనే పాము కనిపించడంతో ఆసుపత్రికి వచ్చే రోగుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో పాములు, ఇతర విషపురుగులు సంచరించకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, పిచ్చి మొక్కలు తొలగించి తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

### కాంగ్రెస్ 'వెయ్యి రోజుల' పాలనపై విజయోత్సవ సంబరాలు

# పట్టణంలో భారీ బైక్ ర్యాలీ



**జహీరాబాద్, సెప్టెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జహీరాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఎ. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ జాతీయ రహదారి మీదుగా పస్తాపూర్ చౌరస్తా



వరకు కొనసాగింది. పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ జెండాలు చేతబట్టి నినాదాలు చేస్తూ పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు సాగారు. దీంతో పట్టణంలో కొంతసేపు సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైతులు, మహిళలు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, కొత్త రేషన్ కార్డుల జారీ, ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజా సంక్షేమ పాలనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని చంద్రశేఖర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్కల్, కోహీర్, మొగుడంపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి ,మున్సిపల్ చైర్మన్లు మహమ్మద్ యూనుస్, అశోక్ కుమార్ ,పట్టణ అధ్యక్షులు నరేష్ గౌడ్ ,మండల అధ్యక్షులు హుగ్గేల్లి రాములు, సువర్ణ-మల్లన్న పాటిల్ ,ఉదయ్ శంకర్ పాటిల్, పవన్ రాథోడ్ ,పట్టణ అధ్యక్షులు ముజాఫ్ఫార్ హుస్సేన్,మాజీ పట్టణ అధ్యక్షులు కండేం.నర్సింలు ,తాజా మాజీ మండల పట్టణ అధ్యక్షులు ,కౌన్సిలర్లు, సర్పంచులు,మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ,సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# కన్నుల పండువగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జోగిపేట కేంబ్రిడ్జి పాఠశాలలో



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 04 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని జోగిపేట కేంబ్రిడ్జి పాఠశాలలో, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను కన్నుల పండువగా, నిర్వహించారు, కృషులు,గొల్లభామల,వేషధారణలో అలరించిన చిన్నారులు, ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థుల నృత్యాలు, డీజే పాటల హోరుమధ్య ఉత్సాహంగా ఉట్టి కొట్టిన,చిన్ని కృష్ణులు, విద్యార్థులతో కలిసి స్టెప్పులు వేసిన,ఉపాధ్యాయులు, ఈ కార్యక్రమంలో చిన్నారులకు సంస్కృతికవైభవాన్ని పరిచయం చేసిన,పాఠశాల చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ వరశీ గోపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మణరావు, సాటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.....

## పెదకాకానిలో ఉద్రిక్తత

గుంటూరు  పెదకాకాని లో శుక్రవారం ఉద్రికత్త నెలకొంది. మాల్లాది విష్ణ కారుపై దాడికి టీడీపీ కార్యకర్తలు ప్రయత్నించడం కలకలం రేపింది. అమ్మవారి మంగళసూత్రం మాయం కావడంపై ఆందోళన మొదలయింది. నాంతాడు కానుకగా  అంబటి మురళీ కృష్ణ సమర్పించడానికి ముందుకు వచ్చారు. అంబటి మురళీకృష్ణను అడ్డుకోవాలని టీడీపీ నాయకుల ప్లాన్  వేసారు.  ఈ నేపథ్యంలో పెదకాకాని ఆలయానికి టీడీపీ నాయకులు భారీగా చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే మాల్లాది విష్ణను అడ్డుకొని.. దాడికి యత్నం చేసారు.

## రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



**జహీరాబాద్, సెప్టెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి:** రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ సంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీ కృషి చేయాలని సభ్యులు ఆకాంక్షించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎ. రవి భూషణ్, ఉపాధ్యక్షుడిగా జి. వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఖైరున్నీసా, కోశాధికారిగా మెతరి రాజు, సహాయ కార్యదర్శిగా ఎం. చంద్రకళ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా హిమగిరి ప్రసాద్, పి. మహేందర్, దప్పు అశోక్, వై. నాగరాజులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అంజయ్య, రమేష్, సంతోష్, ఎం. రాజు, గాయత్రి, జి. నర్సింహులు ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం అమలులో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సంఘ సభ్యులందరి సహకారంతో యూనియన్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

## బాలానగర్‌లో వేడెక్కిన రాజకీయం, ఉద్రిక్తత.. కాంగ్రెస్ నేతల అరెస్ట్..



**కూకట్పల్లి (ప్రజాబలం) సెప్టెంబర్ 04:** తెలంగాణలో ప్రజా సమస్యలు, నిరసనలతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య పరస్పర ఆరోపణలు, సవాళ్లతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఈ క్రమంలోనే కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని బాలానగర్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన 'పోరుబాట' కార్యక్రమం బాలానగర్‌లో ఉద్రిక్తతకు దారితీసింది. బాలానగర్ మాజీ కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

అయితే, ఎమ్మెల్యే కృష్ణారావు కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా యత్నించాయి. బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే కాన్వాయ్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది.

రంగంలోకి దిగిన పోలీసులు కాంగ్రెస్ నేతలను, కార్యకర్తలను అడ్డుకున్నారు. నిరసన తెలిపిన బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులి శ్రీకాంత్ పటేల్, ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ నాయకుడు ఆకుల నరేందర్‌తో పాటు శివ, రవి గౌడ్,మహేందర్, శ్వేత తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ శ్రీ విట్టల్ రెడ్డి  జయంతి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్ 04 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :ఈసందర్భంగా ఈరోజు శుక్రవారం నర్సాపూర్ లో జిల్లా గ్రంథాలయ సమస్త చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరా రెడ్డి, విట్టల్ రెడ్డి విగ్రహానికి పూల మాలవేసి నివాళులుఅర్పించ డంజరిగింది. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణారావు,ముదిరాజ్ ,మాజీ వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, కౌన్సిలర్ శ్రీకాంత్, శ్రీశైలం యాదవ్, కిషన్ నాయక్ , బాలరాజు, సంఘసాని రాజు,చిరంజీవి,విట్టల్ రెడ్డి గారి అభిమానులు మరియు తదితరులు పాల్గొన్నారు..

## ఘనపూర్ నుండి ర్యాలీలో పాల్గొన్న బి ఆర్ ఎస్ నాయకులు సంతోష్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి సెప్టెంబర్ 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల స్థాయి ర్యాలీలో బి ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది కాంగ్రెస్ పార్టీ 1000 రోజుల పూర్తి కాలంలో పని తీరుపై మరియు ఆరు గ్యారెంటీ లపై నిరసనగా మర్పల్లిలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరిగింది ర్యాలీలో ఘనపురం యువ నాయకులు సంతోష్ , నాగయ్య స్వామి,బిచ్చన్న మాజీ ఎంపిటిసి ,మోహన్ ,ప్రవీణ్ ,విజయ్ కుమార్ ,శివకుమార్, సుచి ,కార్యకర్తలు ర్యాలీలో పాల్గొనడం జరిగింది అని తెలిపారు

## 'వంటా వార్పు'తో కాంగ్రెస్ పాలనపై నిరసన పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు



**జహీరాబాద్, సెప్టెంబర్ 4 ప్రజాబలం ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు 'వంటా వార్పు' కార్యక్రమం నిర్వహించాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపు మేరకు చేపట్టిన వారం రోజుల నిరసనల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం జహీరాబాద్‌లోని లైఫ్‌స్టైల్ కాంప్లెక్స్ మోర్ సూపర్‌మార్కెట్ వద్ద కార్యక్రమం చేపట్టారు.



ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఆధ్వర్యంలో మహిళా నాయకులు వంటలు వండి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ ఇస్తామని చెప్పి విస్మరించారని ఆరోపించారు.

మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, సంజీవ్‌రెడ్డి, నర్సింలు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ షబానా తంజీమ్, సీనియర్ నాయకులు నామా రవికిరణ్, మహిళా నాయకులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొండల్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి సెప్టెంబర్4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగాల్, గ్రామం పంచలింగాల్ వాస్తవ్యులు ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మాజీ వికారాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టరేట్ అవార్డు గ్రహీత సనా గారి కొండల్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు ఆయన పుట్టినరోజు సందర్భంగా అనాధ ఆశ్రమంలో పండ్లు పంపిని చేయడం జరిగిందని తెలిపారువికారాబాద్ జిల్లా మాజీ లైబ్రేరీ చైర్మన్ కొండల్ రెడ్డి విశిష్ట అందించి ఎందరో విద్యార్థులకు కోచింగ్ సెంటర్లు నిర్వహించి న పేదల పెన్నిధి మనసున్న మా ఊరి మారాజు కొండల్ రెడ్డి జన్మదిన సందర్భంగా మోమిన్‌పేట్ లోని హెల్ప్ ఆల్ సొసైటీమరియు మదీనాగూడ అనాధ ఆశ్రమంలో పిల్లల కు అరటిపండ్లు, యాపిల్ పండ్లు పంపిని చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఎస్.కె.ఆర్ ట్రస్ట్ సభ్యులుఎం.ఆంజనేయులు గౌడ్,బి.సురేష్ కుమార్,వి.చంద్రశేఖర్, ఎఫ్,హైమద్,కె.సంజీవ్,ఆర్. సోఫి,పి.కృష్ణ,కె.అశోక్, బి.జైపాల్,ఎ.రవి,పి,సంగమేష్,ఎస్.జైపాల్ పాల్గోనడం జరిగింది అని తెలిపారు

## ఐసీఎఫ్ఏఐ లా స్కూల్‌లో శ్రీ ఎన్.జె. యసస్వీ స్మారక 11వ మూట్ కోర్ట్ పోటీ ప్రారంభం




**హైదరాబాద్, సెప్టెంబర్ 4: (ప్రజాబలం ప్రతినిధి)** శ్రీ ఎన్.జె. యసస్వీ స్మారక 11వ మూట్ కోర్ట్ పోటీ--2026 ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లోని ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, ఐఎఫ్‌హెచ్ఈలోని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు.సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ పోటీ జరుగుతోంది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ప్రదీప్ రాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.




ఐఎఫ్‌హెచ్ఈ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (డాక్టర్) ఎ. వినయ్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ (డాక్టర్) ఎస్. విజయలక్ష్మి ప్రసంగించారు. లా స్కూల్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ (డాక్టర్) విజేందర్ కుమార్ ప్రత్యేక ప్రసంగం చేశారు.ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) పూజారి రవిశేఖరరాజు అధ్యక్షోపన్యాసం చేయగా, డీన్ ప్రొఫెసర్ (డాక్టర్) వై. ప్రతాప్ రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు.

ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ అసిస్టెంట్ డీన్ (విద్యార్థి కార్యకలాపాలు) డాక్టర్ ఎ. అరుణ్ కుమార్ స్వాగత ప్రసంగం చేశారు. మూట్ కోర్ట్ సొసైటీ కోఆర్డినేటర్ డాక్టర్ సయన్ దాస్ సమన్వయకర్త ప్రసంగం చేశారు. మూట్ కోర్ట్ సొసైటీ అధ్యక్షురాలు శ్రీమతి చిందం లిఖిత, కో-కోఆర్డినేటర్ డాక్టర్ కర్వాలే సదానంద్ అనంతరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీ మూడు రోజుల పాటు కొనసాగనుంది.

# తెలంగాణలో అవినీతి అక్రమాలే రాజ్యమేలుతున్నాయి





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 4 ఏటూరు నాగారం** బీ.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ములుగు జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.బి

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మోసపూరిత పాలనపై టిఆర్ఎస్ నాయకులు ప్రజలను చైతన్య పరుస్తూ అందులో భాగంగానే. ఏటూరు నాగారం మహిళలతో పాటు స్థానిక మహిళలు సైతం అధిక సంఖ్యలో తరలివచ్చారు

ఊడగూడెం నుంచి చేపట్టిన ర్యాలీ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వరకు సుమారు 1000 మంది తొ బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం దద్దరిల్లిపోయింది. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై వంటావార్పు చేపట్టి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు

అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో అభివృద్ధి శూన్యం అని అన్నారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకు పోతుందని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు చేసిందేమిటో నిరూపించాలని అన్నార

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిర్లక్ష్యం చేయడానికి గల కారణాలను చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును తెలంగాణ రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు

కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి సీతక్కపై ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గతీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, అనేక డిక్లరేషన్లు అని చెప్పి అధికారంలోకి వచ్చారని, 33 నెలలు గడిచినా నేటికీ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. ప్రజలకు హామీల లెక్క చెప్పాల్సిన ప్రభుత్వం గత ప్రభుత్వాన్ని తిట్టడానికే, ర్యాలీలు చేయడానికే పరిమితమైందని ఎద్దేవా చేశారు.బి

ఏటూరునాగారం ప్రజలకు ఇచ్చిన హామీలపై మంత్రి సీతక్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ లక్ష్మణ్ బాబు 10 ప్రశ్నలను సంధించారు. ఏటూరునాగారాన్ని రెవెన్యూ డివిజన్‌గా కేసీఆర్ ప్రకటించినప్పటికీ నేటికీ కార్యరూపం దాల్చలేదని, ఏజెన్సీ ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ఎందుకు పక్కన పెట్టారో చెప్పాలని పేర్కొన్నారు.

నూతన బస్టాండ్‌తో పాటు డిపో నిర్మాణం ఎక్కడ అని ప్రశ్నించారు. ఆధునిక బస్టాండ్, డిపో నిర్మిస్తామని చెప్పి మూడేళ్లు గడిచినా శంకుస్థాపన కూడా చేయకపోవడంతో పాటు వాటికి నిధులు, టెండర్లు కూడా వేయలేదని ఆరోపించారు

గోదావరి కరకట్ట నిర్మాణం ఎప్పుడు చేపడతారో చెప్పాలని, గోదావరి వరదల్లో ప్రజల ఇళ్లు మునిగిపోతున్నాయని, ప్రతి ఏటా ఎస్టిమేట్లు మార్చడం తప్ప కరకట్ట నిర్మాణానికి ఏం చేశారని నిలదీశారు.బి

రైతుకు గిట్టుబాటు ధర ఏమైందని, యూరియా కోసం రైతులు క్యూలలో నిలబడాల్సిన దుస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలన్నారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ లెక్కలేమైనట్టు అని విమర్శించారు

కమలాపూర్ ఫ్యాక్టరీపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోరాటం చేసిన సీతక్క, నేడు అధికారంలోకి వచ్చి 33 నెలలు గడిచినప్పటికీ ఎందుకు తెరవలేదని ప్రశ్నించారు.

స్థానిక గిరిజన యువతకు ఉపాధి ఎప్పుడు అందిస్తారో చెప్పాలన్నారు. రూ.500 గ్యాస్ లెక్కలేమైనట్టు అని, ఎంతమంది మహిళలకు సబ్సిడీ అందిందో ప్రకటనలు చేయకుండా లబ్ధిదారుల జాబితా విడుదల చేయాలని కోరారు. పోడు భూముల సమస్యకు పరిష్కారం ఎప్పుడో చెప్పాలని, ఆదివాసీల జీవనాధారమైన పోడు భూముల సమస్యపై అసెంబ్లీలో ఎందుకు చర్చించరని, కేసీఆర్ హయాంలో పట్టాలిచ్చి ఆదుకుంటే మీరేం చేశారని ప్రశ్నించారు. ఐటీడీఏ నిర్వీర్యమైనప్పటికీ గిరిజన మంత్రిగా ఉండి ఐటీడీఏను బలోపేతం చేయకుండా ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పెన్షన్లతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఎందుకు ఆగిపోయాయని నిలదీశారు. 33 నెలల పాలన తర్వాత కూడా ప్రతి సమస్యకు గత ప్రభుత్వాన్ని కారణంగా చూపడం సరైనది కాదని, కాంగ్రెస్ మోసాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు

ములుగు నియోజకవర్గంలో దొరలు, గడీల పాలన అనడం సరైంది కాదని, మాది "జనతా గ్యారేజ్" అని లక్ష్మణ్ బాబు పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు పార్టీలకు అతీతంగా ప్రజల సమస్యలపై ముందుండి పోరాడుతామని తెలిపారు. ములుగు ప్రజలను దోచుకునే నాయకులకు, సమస్యలను నిర్లక్ష్యం చేసే రాజకీయాలకు రాజకీయంగానే గట్టి రిపేర్లు చేస్తామని హెచ్చరించారు. విమర్శలు చేయడం కాదని, హామీల లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు

ప్రజా సమస్యలను గాల్లో వదిలి తెలంగాణలో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ పై తమ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టే క్రమంలో ఏటూరునాగారంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, బ్యానర్లను పోలీస్ అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు తొలగించడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా తమ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు ఆగవని, తమకు ప్రజా మద్దతు ఉందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వంటావార్పు వద్దకు చేరుకుని కార్యకర్తలకు, మహిళలకు వడ్డించారు.

ఏదేమైనప్పటికీ ఏటూరునాగారం మండల కేంద్రంలో గులాబీ సైన్యం ఉగ్రూతలూగింది.

ఈ కార్యక్రమంలో ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి, ముఖ్య నాయకులు పోరిక గోవింద్ నాయక్, తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, భూక్య జంపన్న, గడదాసు సునీల్ కుమార్, కాకులమర్రి శ్రీలత, ఎండి వలీ బాబా, కూనూరు అశోక్ గౌడ్, ఖాజా పాషా, ఎండి సర్దార్ పాషా, కాకులమర్రి ప్రదీప్ రావు, సప్పిడి రాంనర్సయ్య , కాక వెంకటేశ్వర్లు, అంతటి విజయ నాగరాజు, తూరం పద్మ, ఈసం స్వరూప, పోరిక సరితా శ్రీనివాస్, రామ్మూర్తి, మాదరి రామయ్య, కర్ర రవీందర్, తాడు రఘు, కుమ్మరి చంద్రబాబు, శుభల సమ్మయ్య, కుడుముల లక్ష్మీనారాయణ, చిన్నికృష్ణ, లకావత్ నరసింహ నాయక్, మసర గాని వినయ్ కుమార్, బైకాను ఓదెలు, కోళ్ల వెంకన్న, కోయిల మహేష్, కోయిల లక్ష్మి, బండి లక్ష్మి, కొమరం ధనలక్ష్మి, దనపనేని కిరణ్, జాడి బోజారావు, ఎలవర్తి శ్రీనివాసరావు, చిట్టిమల్ల సమ్మయ్య, రాజు యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షులు బోడా శంకర్, మాదరి రాంబాబు, ఆతుకూరి రాంబాబు, కొండగుర్ల లక్ష్మణ్, ఇట్టెం రాంబాబు, వావిలాల రాంబాబు, రామకృష్ణ, ఆనంద్, వావిలాల మోహన్, వలస సత్యం, ఏనుగు మహేష్, మోహన్ నాయక్, తుక్కాని శ్రీనివాస్, పప్పు వెంకట్ రెడ్డి, ఎండి కుర్బాన్, అలీ, ఎడ్లపల్లి నరసింహారావు, మూగల రమేష్, నిమ్మగడ్డ ప్రవీణ్ తో పాటు మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.బి

# బి ఆర్ ఎస్ నాయకుల వాక్యాలపై మండిపడ్డ కాంగ్రెస్ నాయకులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి సెప్టెంబర్ 04 ఏటూరు నాగారం**

బీఆర్ఎస్ నేతల విమర్శలు హాస్యాస్పదం

ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేసే ముందు పదేళ్ల పాలనకు లెక్క చెప్పాలి

ప్రజల కోసం పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వంపై బురదజల్లడం సరికాదు

బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన హామీలు, చేసిన అప్పులపై సమాధానం చెప్పాలి

కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి సీతక్కపై బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు చేసిన విమర్శలను కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను పక్కనపెట్టి రాజకీయ ఆరోపణలు చేయడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ నిరాశకు నిదర్శనమని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల అమలుకు నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మహిళలు, రైతులు, యువత, పేదలు, గిరిజనులు, వృద్ధులు, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని పూర్తిగా అమలు చేసిందో ముందుగా బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

గత పాలనను ప్రజలు మరిచిపోలేదు

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. లిదళితులకు మూడు ఎకరాల భూమి, దళితుడిని ముఖ్యమంత్రి చేయడం, లిఇంటికో ఉద్యోగం వంటి హామీల పరిస్థితి ఏమైందో బీఆర్ఎస్ నాయకులు ముందుగా చెప్పాలని ప్రశ్నించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసేలా గత ప్రభుత్వం చేసిన అప్పులు, పెండింగ్ బిల్లులు, ఆర్థిక భారాన్ని పక్కనపెట్టి కొత్త ప్రభుత్వం వచ్చి కొద్దికాలంలోనే అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేయడం రాజకీయంగా సమంజసం కాదన్నారు.

మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంది

లిమహిళా సంక్షేమంపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదమనీ కాంగ్రెస్ నాయకులు అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలతో మహిళల కుటుంబ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయడం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలను ఆర్థికంగా ఎదిగేలా చేయడం ప్రభుత్వ ప్రాధాన్యతలని అన్నారు. మహిళలను ర్యాలీలకు తీసుకొచ్చి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం వల్ల వాస్తవాలు మారవని పేర్కొన్నారు.

మంత్రి సీతక్కపై విమర్శలు చేయడం రాజకీయ దివాళాకోరుతనం

ములుగు నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి సీతక్క నిరంతరం ప్రజల్లో ఉంటూ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు, విద్య, వైద్యం, తాగునీరు, సంక్షేమం, గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు.

ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్న నాయకురాలిపై వ్యక్తిగత విమర్శలు చేయడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ స్థాయిని తెలియజేస్తోందని అన్నారు.

ఏటూరునాగారం అభివృద్ధిపై కాంగ్రెస్‌కు స్పష్టమైన ప్రణాళిక

ఏటూరునాగారం ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. బస్టాండ్, రోడ్లు, డ్రైనేజీ, గోదావరి వరదల సమస్య, గిరిజన ప్రాంతాల మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రభుత్వం దశలవారీగా చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.

ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యలను ఒక్కసారిగా పరిష్కరించలేమని, ప్రజల అవసరాలను గుర్తించి నిధులు సమకూర్చు కుంటూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు.

లిరైతులపై బీఆర్ఎస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదు

రైతుల సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతు రుణమాఫీ, రైతు సంక్షేమం, వ్యవసాయానికి అవసరమైన మద్దతు వంటి అంశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

యూరియా, ఎరువుల విషయంలో కేంద్ర ప్రభుత్వ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టడం సరికాదని పేర్కొన్నారు. రైతులను రాజకీయాలకు ఉపయోగించుకోవడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.

లిజనతా గ్యారేజ్ పేరుతో రాజకీయ డ్రామాలు వద్దు

ములుగులో జనతా గ్యారేజ్ అంటూ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం ప్రజలను నవ్వించేలా ఉందని కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారు. లిపదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల సమస్యలను ఎంతవరకు పరిష్కరించారో ప్రజలకు వివరించాలని అన్నారు.

ప్రజలు అధికారాన్ని కాంగ్రెస్ పార్టీకి ఎందుకు అప్పగించారో బీఆర్ఎస్ నాయకులు గుర్తు చేసుకోవాలని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని సూచించారు.

ప్రజలే బీఆర్ఎస్ రాజకీయాలకు సమాధానం చెబుతారు

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడానికి బీఆర్ఎస్ నాయకులు నిరసనల పేరుతో రాజకీయ డ్రామాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తు న్నారని, కేవలం ఆరోపణలు, విమర్శలతో ప్రజలను నమ్మించలేరని అన్నారు.

బీఆర్ఎస్ నాయకులు నిజంగా ప్రజా సమస్యలపై పోరాడాలనుకుంటే ప్రభుత్వ కార్యక్రమాలకు నిర్మాణాత్మక సూచనలు చేయాలని, లేనిపక్షంలో రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు.లికాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉంది ములుగు నియోజకవర్గ అభివృద్ధ ఏజెన్సీ ప్రజల సంక్షేమం కోసం మంత్రి సీతక్క చేస్తున్న కృషి కొనసాగుతుంది బీఆర్ఎస్ ఎన్ని విమర్శలు చేసినా ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గదు" అని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కొండా సురేఖ భర్తరఫ్ బాధ కలిగించింది డికే అరుణ

హైదరాబాద్ కొండా సురేఖ బర్తరఫ్ పై ఎంపీ డీకే అరుణ స్పందించారు. కొండా సురేఖ సీనియర్ మహిళా నాయకురాలు. కాంగ్రెస్ లోని ఇంటర్నల్ రాజకీయ విభేదాలు ఆమె ను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ కి దారి తీసాయని భావిస్తున్నాను..రాజకీయాల్లో అనేక గ్రూపులు తగాదాలు ఉంటాయి.. కాంగ్రెస్ లో అవి రోజు చూస్తున్నాం. కొండా సురేఖ సీనియర్ నాయకురాలు, 2009 లో ఆమె నేను మంత్రులుగా కలసి పని చేశాం. నా తోటి ఒక మహిళ నాయకురాలు మంత్రిగా తెలంగాణ కు సేవలు అందిస్తున్నారని సంతోషపడ్డాం. ఆమెను బర్తరఫ్ చేయడం నిజంగా బాధకలిగించింది. బీసీలకు కాంగ్రెస్ పార్టీ,సీఎం ఎంతో చేశామని గొప్పలు చెప్పుకుంటారు. తాను బీసీ మహిళా. తన కూతురు ఏదో మాట్లాడిందని సురేఖ మీద యాక్షన్ తీసుకోవడం సరికాదు, సమర్థనీయం కాదు. ఒక మహిళ రాజకీయాల్లో కష్టనష్టాలను ఎదుర్కొని నిలబడటం, ఇంతవరకు రావడమనేది గొప్ప విషయం. మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయడం సమర్థనీయం కాదు. ఇప్పటివరకు బీజేపీలోకి ఆహ్వానించే అటువంటి చర్చలు ఏవీ జరగలేదన అన్నారు.

## శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి...

కొలిమిగుండ్ల సెప్టెంబర్ 4 కొలిమిగుండ్ల మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్ల టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డిని పలువురు యాదవ సంఘం నాయకులు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లోకేపల్లె మధు ప్రసాద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రాజనేని చంద్ర, రవికుమార్, వెంకట రాముడు, బొట్టు స్వామి, గొంగటి హుస్సేన్ రెడ్డి, కళ్యాణ్ రెడ్డి, వేణు యాదవ్, ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు యాదవ సంఘం నాయకులు గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com